ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 25 డిసెంబరు 2024



ఫిరంగిపురంలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య



డాన్‌బాస్కో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



పునీత ఆగ్నేసమ్మ దేవాలయంలో క్యాండిల్స్ వెలిగిస్తున్న భక్తులు

..హ్యాపీ క్రిస్మస్

- అర్ధరాత్రి పూజలతో వేడుకలు ప్రారంభం
- బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ ప్రార్థనలు
- రంగురంగుల విద్యుత్ దీపాలతో కాంతులీనుతోన్న చర్చిలు
- చర్చిల్లో కేకులు కట్ చేసి.. క్యాండిల్స్ వెలిగించి.. మిఠాయిల పంపిణీ

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రంగురంగుల విద్యుత్ దీపాలతో చర్చిలు కాంతులీనుతుండగా.. నూతన వస్త్రాలు ధరించి చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సందడి చేస్తుండగా.. క్రిస్మస్ వేడుకలు మంగళవారం అర్ధరాత్రి పూజలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి పట్టణ, గ్రామాల కూడళ్లలో క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ క్రైస్తవులు ఆనందోత్సాహాలతో బాణాసంచా కాల్చి ఉత్సవాలు జరుపుకున్నారు. హ్యాపీ క్రిస్మస్.. హ్యాపీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో క్రిస్మస్ సందడి వాతావరణం నెలకొంది. అన్ని గ్రామాలు, పట్టణాల్లో చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు బాణాసంచా కాల్చి.. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి క్రైస్తవులు ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అత్యంత భారీ నక్షత్రాలు వీధుల్లో విద్యుత్ కాంతులతో వెలుగులీనాయి. అదే సమయంలో గుంటూరు మేత్రాసన బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య ఫిరంగిపురంలోని ఆలయంలో అర్ధరాత్రి ప్రత్యేక పూజలతో క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. అనంతరం భక్తులకు దైవ సందేశం ఇచ్చారు. లోక శాంతి, పాప పరిహారం, సర్వమానవాళి రక్షణ కోసమే క్రీస్తు మనిషి రూపంలో జన్మించారని తన సందేశంలో పేర్కొన్నారు. గుంటూరు నగర పరిధిలోని పునీత ఆగ్నేసమ్మ దేవాలయం, నిత్య సహాయ మాత ఆలయం, దివ్య బాలయేసు దేవాలయం, నార్త్ ప్యారిస్ చర్చి, వెస్ట్ ప్యారిస్ చర్చిలో పాస్టర్లు క్రిస్మస్ సందేశం ఇచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రభోదించిన దయ, క్షమ, ప్రేమ, కరుణ, వంటి బోధనలను ప్రతి ఒక్కరు ఆచరించాలని సందేశమిచ్చారు. తెనాలిలో బోసురోడ్డులోని టౌన్ చర్చి, ఐతానగర్‌లోని క్రీస్తు కృపాలయం, సాల్వేషన్ ఆర్మీ చర్చిలను ప్రార్థనలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. పొన్నూరులో వందేళ్ల చరిత్ర కలిగిన క్రీస్తు శతవార్షిక లూథరిన్ దేవాలయంలో క్రీస్తు జననాన్ని స్మరించుకునేలా చర్చి వద్ద ఏర్పాటు చేసిన స్టార్ భక్తులను ఆకట్టుకుంది.

ఆరుబయట పూజలకు వర్షం అడ్డంకి

క్రిస్మస్ సందర్భంగా ఏటా అర్ధరాత్రి జరిగే పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. దీంతో చర్చిల్లో భక్తులు పట్టే అవకాశం ఉండదు. అందువల్ల అర్ధరాత్రి పూజలను ఆరుబయట నిర్వహించడం ఆనవాయితీ. అయితే పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి కూడా వర్షం కురవడంతో ఆరుబయట పూజలకు అడ్డంకిగా మారింది.





పునీత ఆగ్నేసమ్మ, డాన్‌బాస్కోలో సాంస్కృతిక కార్యక్రమాలు

వాయుగండం



నగరం మండలం ధూళిపూడి గ్రామంలో తడిచి ముద్దయిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతు

జిల్లా అంతటా జల్లులు

- కోతకోయని చేలన్నీ నేల మట్టం
- పంటలపై వాయుగుండం ప్రభావం
- తడిచిన ధాన్యం.. పొలాల్లోనే ఓదెలు
- హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద హెచ్చరిక
- వరుస తుఫాన్లతో బెంబేలెత్తుతున్న అన్నదాతలు

వరుస వాయుగుండాలు.. వణికిస్తున్నాయి. అన్నదాతలను వాయుగుండాలు వీడటంలేదు. ధాన్యం చేతికొచ్చే డిసెంబరు నెలలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో నాలుగు రోజులుగా వాతావరణం పూర్తిగా మారి వర్షం దోబూచులాడుతూ వచ్చింది. సోమవారం ఆకాశం మేఘాలతో కమ్ముకున్నా పెద్దగా ఇబ్బంది ఉండదన్న భరోసాతో కొందరు రైతులు కోతలు కోశారు. మరికొందరు యంత్రాల సాయంతో కోసి ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. వాయుగుండం కారణంగా మంగళవారం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తెల్లవారుజాము నుంచి కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో పాటు చిరుజల్లుల నుంచి ఓ మోస్తరుగా వర్షాలు పడ్డాయి. ఆరు గాలం శ్రమించిన పంట చేతికందేలోపు అకాల వర్షం నష్ట పరుస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముమ్మరంగా నూర్పిళ్లు జరగాల్సిన సమయంలో వర్షం అడ్డంకిగా మారింది.



బొల్లాపల్లి : కల్లాల్లో ఆరబోసిన మిర్చి, ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు



బాపట్ల మండల పరిధిలోని నందిరాజుతోట హైవేపై ఆరబోసిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న రైతులు



ఈపూరు మండలంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచే చిరుజల్లులు కురవడంతో పాటు దట్టంగా మసురు కమ్మేసింది. ఇదే తరహా పరిస్థితులు మరో మూడు రోజులు ఉండనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ వరకు కోతలు వద్దని రైతులకు అధికారులు సూచిస్తున్నారు. తుఫాన్ ప్రభావం వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నేటి దాక వచ్చిన పంట అకాల వర్షంతో అపార నష్టం జరుగుతుందని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. రెండు రోజులుగా ముసురు కప్పేసి, అడపాదడపా వరుణుడు ప్రతాపం చూపుతుండటంతో యంత్రాలతో కోతకోసి, ఆరబెట్టిన రైతులకూ నష్టం తప్పలేదు. పట్టాలు ఉన్న వారు ధాన్యంపై కప్పుకుంటున్నారు. అవి దొరకని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షంతో పంట నీట మునగడమే కాకుండా ఓదెలపై నీరు నిలిచి ధాన్యం కుళ్లి పోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లా పరిధిలో కూడా మంగళవారం ముసురు పట్టి అక్కడక్కడ వర్షాలు పడ్డాయి. డెల్టా ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా చాలాప్రాంతాల్లో పైరు నేల వాలింది. వాయుగుండం కారణంగా యంత్రాలతో కోసిన ధాన్యాన్ని రోడ్లు, పొలాల్లో ఆరబెట్టగా వర్షానికి కొంతమేర తడిసిపోయింది. ఇప్పటికే పొలాల్లోని పనలు తడిసి మొలకలు రావడం, పైరు నేలవాలడం, ధాన్యం రంగుమారడం వంటివి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తేమ శాతం కోసం ధాన్యాన్ని ఆరబెట్టుకునే విషయంలో రైతుల కష్టాలు గడచిన నాలుగు వారాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. వర్ష హెచ్చరికల నేపథ్యంలో తడిగా ఉండగానే కుప్పలు వేస్తున్నారు. జల్లులకు తోడు ఎడతెగని ముసురు అన్నదాతలను భయపెడుతోంది. జల్లులతో అల్పపీడన ప్రభావం వీడితే కొద్ది నష్టంతో బయటపడతామని, అలాకాకుండా రాబోయే రెండు రోజుల్లో ఓ మోస్తరు వర్షం పడినా పొలాల్లో నీళ్లు నిలబడతాయని, దీని వల్ల ధాన్యం రంగుమారడంతో పాటు దిగుబడుల్లో కూడా గణనీయంగా తేడా కనబడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. దిగుబడులు

(మిగతా 6వ పేజీలో)

డెల్టాను వీడని గండం

కృష్ణా పశ్చిమ డెల్టాపై వరుణుడి ప్రకోపం తగ్గలేదు. వరుస వాయుగుండాలతో గండం వెంటాడుతూనే ఉంది. డెల్టాలో 60 శాతం వరి కోతలు పూర్తయితే, 40 శాతం పైరు దశలోనే ఉంది. కోతలు ఇప్పటికే పూర్తి చేసినవారు గత వర్షాలకు నష్టపోయారు. మిగిలిన చేలల్లో పైరు నేలవాలి రంగుమారగా, ప్రస్తుత వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. డెల్టాలో 5.71 లక్షల ఎకరాలు సాగవుతుంటే, దానిలో బాపట్ల జిల్లాలో అత్యధికంగా 3,79,997 ఎకరాలు, గుంటూరు జిల్లా పరిధిలో 1,84,190 ఎకరాలు, ప్రకాశం జిల్లా పరిధిలో 7,164 ఎకరాలు ఉంది. వీటిలో గుంటూరు జిల్లా కిందున్న కాల్వల ఎగువ భూముల్లోని వరి పంట చాలావరకు గట్టెక్కింది. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, పెదకాకాని, తెనాలి, పొన్నూరు మండలాల్లో చాలావరకు కోతలు చివరి దశలో ఉన్నాయి. ఇంకా పొన్నూరు మండలంలోనే కొంత ఎక్కువ కోత కొయ్యాల్సి ఉంది. కొల్లూరు, వేమూరు, తెనాలి, కొల్లిపర, భట్టిప్రోలు మండలాల్లో కొన్నిచోట్ల పూర్తిగా ఆరిపోయి గోతాలకెత్తిన ధాన్యం బస్తాలకు కిందినుంచి చెమ్మ చేరడంతో తడిచిపోయాయి. జంపని, మూల్పూరు, అమృతలూరు, చెరుకుపల్లి ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది. సోమవారం రాత్రి కురిసిన భారీవర్షంతో ఓదెలన్నీ తడిచి ముద్దయ్యాయి. ఈ జల్లులు ఇంతటి వీడితే కొద్ది నష్టంతో బయటపడతామని, అలాకాకుండా వర్షం కొనసాగితే మునిగిపోతామని కన్నీటి పర్యంతమవుతున్నారు. రెండు రోజులుగా ముసురు కప్పేసి, అడపాదడపా వరుణుడు ప్రతాపం చూపుతుండటంతో యంత్రాలతో కోతకోసి, ఆరబెట్టిన రైతులకూ నష్టం తప్పలేదు.

◆ విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలు వర్షాలకు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులను కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఇబ్బందులు ఎదుర్కొంటే 0863-2345103కి కాల్ చేయవచ్చన్నారు.

ఆధునిక హంగులతో..
శంకర్‌విలాస్ బ్రిడ్జి

- ఐకానిక్ బ్రిడ్జి తరహాలో వంతెనకు ప్రతిపాదనలు
- నిర్మాణంపై అధికారులతో డాక్టర్ పెమ్మసాని సమీక్ష

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆధునిక హంగులతో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణంపై అధికారులతో ఆయన మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకానిక్ తరహాలో ఆధునిక హంగులతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైల్వే, ఇతర శాఖల నుంచి అనుమతుల కోసం నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. బ్రిడ్జి ల్యాండ్ అయ్యే ప్రాంతంలో వాహనాల రాకపోకలకు సంబంధించిన సౌకర్యాల నిమిత్తం పలు అంశాలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు, వాహనాల రాకపోకలకు సంబంధించిన సౌకర్యాలపై అధికారులతో చర్చలు జరిపారు. మెడికల్ కాలేజీ, రైల్వే స్టేషన్‌కు వెళ్లేదారుల్లో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు పెమ్మసాని సూచించారు. వంతెన నిర్మాణానికి ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం ఉన్న నేపథ్యంలో సర్వీస్ రోడ్డు సమస్యలు పరిష్కరించాలన్నారు.



శంకర్ విలాస్ బ్రిడ్జి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

ఆర్‌యూబీకి ప్రతిపాదనలు

భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా శంకర్ విలాస్ బ్రిడ్జి కింద నుంచి ఆర్‌యూబీ నిర్మాణానికి ప్రతిపాదనలపై అధికారులతో చర్చలు జరిపారు. ఆర్‌యూబీకి కావాల్సిన డిజైన్లు, ప్రతిపాదనలు త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే అధికారులకు తెలిపారు.

గోరంట్ల నుంచి అన్ని ప్రాంతాలకు తాగునీరు

గోరంట్ల కొండపై నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి నగరంలో అన్ని ప్రాంతాలకు, విలీన గ్రామాలకు సమగ్రంగా తాగునీరు అందాలని డాక్టర్ పెమ్మసాని అధికారును ఆదేశించారు. గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల్లో జాప్యంపై కార్పొరేషన్ అధికారులతో గార్డెన్స్‌లోని ఎంపీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సత్వరం పనులను పూర్తి చేసి వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశుధ్య సమస్యలపై సమీక్ష..

నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణ, సమస్యలపై డాక్టర్ పెమ్మసాని సమీక్షించారు. చెత్త సేకరణకు సంబంధించి ట్రాక్టర్లను ఉపయోగించాలని గతంలోనే ఆదేశించినా నేటికీ అమలు కాకపోవడంపై అధికారులను పెమ్మసాని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో శానిటేషన్ నిర్వహణకు ట్రాక్టర్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, అదనపు కమిషనర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్ ఆధునికీకరణపై..

గుంటూరు చానల్ ఆధునికీకరణ, విస్తరణపై నీటి పారుదలశాఖ అధికారులతో పెమ్మసాని సమీక్షించారు. విస్తరణ పనులకు సంబంధించి డీపీఆర్ అంశాలపై అధికారులతో చర్చలు జరిపారు.

8

గుంటూరు - నడికుడి సెక్షన్‌లో
పెరిగిన రైళ్ల క్రాసింగ్‌లు

- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

ఉపాధి కూలీలకు తీపికబురు

- ఇకపై కనీస వేతనం రూ.300
- నిరంతరం తనిఖీలు, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

167ఏ హైవే అలైన్‌మెంట్‌ను మార్చండి

- కేసానుపల్లి, జొన్నలగడ తదితర గ్రామాల రైతుల డిమాండ్
- జొన్నలగడ్డ వద్ద కర్నూలు-గుంటూరు రహదారిపై రాస్తారోకో

నరసరావుపేట టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జొన్నలగడ్డ వద్ద కర్నూలు-గుంటూరు హైవేపై మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. నకరికల్లు అడ్డరోడ్డు - చీరాల ఓడరేవు 167ఏ హైవే అలైన్‌మెంట్‌ను మార్చాలని కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సపాలెం, గుంటగార్లపాడు, రావిపాడుకు చెందిన రైతులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొంత మంది బడా నాయకులు, రాజకీయ నాయకులు భూములు కొనుగోలు చేశారని, వాళ్ళ స్వార్థం కోసం చిన్న, సన్నకారు రైతులను ఇబ్బంది పెడుతూ పాతఅలైన్‌మెంట్‌నే ఖాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చిన



రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్ కే వేణుగోపాలరావు, డీఎస్పీ కే నాగేశ్వరరావు తదితరులు

గడ్కరి కమిటీ ఇక్కడి రైతులను సంప్రదించ కుండా మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో కూర్చుని ఇప్పటికే ఉన్న అలైన్‌మెంట్‌నే ఖాయం చేశారని ఆరోపించారు. ఇక్కడ రెవెన్యూ డిపార్టుమెంట్ సహకరించకుండా, తెలియకుండా రాళ్ళు పాతడం, పోలీసులను అడ్డుపెట్టుకొని తమ భూములను కాపాడుకునే హక్కు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే మంత్రి లోకేశ్‌ను కలిశామని, ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలవ నున్నట్లు చెప్పారు. రైతులకు హక్కులేదని అంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. 167ఏ హైవేకి మూడు అలైన్‌మెంట్‌లు సూచించారని అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటకి ఒక కిలోమీటరు దూరంలో 167ఏ హైవే ఏర్పాటు చేస్తున్నారని, పట్టణానికి ఇంతదగ్గరగా హైవే ఏర్పాటు ఎక్కడా లేదన్నారు. కష్టపడి సంపాదించుకున్న పొలాలు రోడ్డు కింద పోతే తమ భవిష్యత్ అంధ కారం అవుతుందన్నారు. ఇచ్చిన మూడు అలైన్ మెంట్‌లలో ఆప్షన్-1 లేదా ఆప్షన్-3 ఎంచు కోవాలన్నారని చెప్పారు. ఇప్పుడు వేసే 167ఏ రోడ్డు నాలుగేళ్ల తర్వాత పనికిరాదని, నలుగురు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం ఈ రోడ్డు వేస్తున్నారని రైతుల ఆరోపించారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. రాస్తారోకో చేస్తున్న రైతులతో తహసీల్దార్ కే వేణుగోపాలరావు, డీఎస్పీ కే నాగేశ్వరరావు చర్చలు జరిపి వారి ఆందోళ విరమింపజేశారు.



జొన్నలగడ్డ వద్ద గుంటూరు-కర్నూలు హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ధర్మం గెలిచింది... న్యాయపోరాటం ఫలించింది

- ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ ఆనందం
- ఎట్టకేలకు బీసీ ధ్రువీకరణపత్రం జారీ
- అండగా నిలిచిన మంత్రి నారా లోకేశ్‌కు, టీడీపీ నాయకులకు ఆమె ధన్యవాదాలు

దుగ్గిరాల, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి) :'ధర్మం గెలిచింది.... న్యాయం జరిగింది' అంటూ మూడేళ్ల నిరీ క్షణ అనంతరం బీసీ ధ్రువీ కరణ పత్రాన్ని పొందిన ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ ఆనందం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు బీసీగా అర్హత ఉన్నప్పటికీ రాజకీయకారణాలతో ధృవీ కరణ పత్రం అందక ఎంపీపీ పదవికి దూరంగా ఉన్న ఓ మహిళా ఎంపీటీసీ పోరాటం ఫలించింది. అన్యాయానికి, అధర్మానికి ఆయుష్షు తక్కువని రుజువు చేసింది. మండలపరిషత్ అధ్యక్ష పదవికి బీసీ వర్గానికి కేటాయించగా మండలంలోని 18 ఎంపీటీసీ స్థానాల్లో పదిమంది టీడీపీ సభ్యులు, జనసేన సభ్యురాలితో మొత్తం 11 మంది సభ్యుల మద్దతు కలిగి కూటమిలో బీసీ సభ్యురాలు చిలువూరు ఎంపీటీసీగా గెలుపొందిన షేక్ జబీన్ ఎంపీపీకి పదవి ఖరారైంది. ఈ నేపథ్యంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీ సాధిం చింది. అయినప్పటికీ చిలువూరు ఎంపీటీసీగా గెలుపొందిన షేక్ జబీన్‌కు బీసీ ధృవీకరణ పత్రం అందకుండా చేశారని, మైనార్టీకి చెందిన మహిళ ఎంపీపీ పీఠం దక్కకుండా చేయాలని కుట్రపన్నుతున్నారంటూ టీడీపీ పలు రకాలుగా ఆందోళన చేపట్టినా ఫలితం లేకపోయింది. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ధర్మ పోరాటం చేద్దామని, నాటి ప్రతిపక్ష నేత, నేటి విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ మనోధైర్యంతో ముందుకు వెళ్లాలన్న సూచన మేరకు జబీన్ ముందుకు సాగింది. తక్షణమే సమస్యను విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని హైకోర్టు ఆదే శాలు వచ్చినప్పటికీ, కలెక్టర్ సైతం జబీన్ అభ్యర్థనను తిరస్కరించారు. దీంతో సంఖ్యా బలం లేనప్పటికీ అప్పటి అధికార వైసీపీకి చెందిన బీసీ మహిళను ఎంపీపీని చేశారు. అయినప్పటికీ పట్టువిడవకుండా మనోధైర్యం కోల్పోకుండా బీసీ ధృవీకరణ పత్రం కోసం ఎదురు చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వ చ్చిన తర్వాత సెప్టెంబరులో జబీన్ మరోపర్యాయం బీసీ ధృవీకరణపత్రం కోసం తహసీల్దార్‌ను కలిశారు. బీసీ రిజర్వేషన్ రివిజన్ కమిటీకి వెళ్లాలని సూచించిన మీదట ప్రిన్సిపల్ సెక్రటరీ వద్దకు వెళ్లడం, డిసెంబరు 6న జిల్లా కలెక్టర్‌ను జబీన్ కలవడం జరిగింది. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక తహసీల్దార్ గ్రామంలో వారి బంధువులను విచారణ చేసిన తర్వాత సంబంధిత నివేదికను కలెక్టర్‌కు పంపారు. అంతిమంగా అన్ని అర్హతలూ కలిగిన జబీన్‌కు బీసీ-ఈ ధృవీకరణ పత్రాన్ని జారీ చేశారు. తనకు అండగా నిలిచిన నారా లోకేశ్‌కు, ఎంపీటీసీ సభ్యులకు స్థానిక టీడీపీ నాయకులకు జబీన్ కృతజ్ఞతలు తెలిపారు.



నారా లోకేశ్‌తో షేక్ జబీన్ (ఫైల్)

గోవా-గుంటూరుకు ఎన్‌డీపీ మద్యం అక్రమ రవాణా

- గుంటూరు టూ టౌన్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన
- విక్రయిస్తూ పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుళ్లు, మరోవ్యక్తి
- పల్నాడు జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు
- 133 మద్యం బాటిళ్లు స్వాధీనం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసులే, ఆ అకృత్యానికి పాల్పడుతున్న వ్యక్తికి అండగా నిలిచారు. గోవా, కర్ణాటక రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్‌డీపీ) మద్యం అక్రమంగా తీసుకువచ్చి గుంటూరులో విక్రయిస్తున్న ఆ వ్యక్తికి పోలీసులు సహకరిస్తున్నారు. ఎన్‌డీపీ మద్యం తీసుకొచ్చి ఒక పథకం ప్రకారం గుంటూరు పరిసర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, వీరి అక్రమ వ్యాపారం ఎన్నాళ్లో సాగలేదు. ఎక్సైజ్ పోలీసులకు దొరికిపోయారు. ఈ సంఘటన గుంటూరులోని టూ టౌన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం నాడు జరిగింది. ఎక్సైజ్ శాఖ గుంటూరు ఈఎస్ అరుణ కుమారి కథనం ప్రకారం వివరాలు, స్థానిక నెహ్రూనగర్‌కు చెందిన ఘంటసాల బాజీ బాబు అలియాస్ బాబీ గత కొంతకాలంగా గోవా, కర్ణాటక ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా తీసుకువచ్చి గుంటూరు కేంద్రంగా విక్రయిస్తున్నాడు. ఈ అక్రమ వ్యాపారంలో పల్నాడు జిల్లా నరసరావుపేట అడ్మిన్ అదనపు ఎస్పీ ఆఫీసులో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ గంధ శివకృష్ణ, నరసరావుపేటలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న విష్ణుములకల వాసుదేవరావు, నరసరావుపేట ఎస్‌బీ కానిస్టేబుల్ గా పని చేస్తున్న ఆర్ల ఆనందరావు, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన కుక్కమల్ల సురేష్, ఈ నలుగురు సిండికేట్‌గా మారి గుంటూరు పరిసర ప్రాంతాల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారు. పాత కేసులో నిందితుడు, ప్రస్తుతం సబ్ జైల్‌లో ఉన్న బాజీబాబుకు స్నేహితులుగా మారి ఈ వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయమై గుంటూరు టూ టౌన్ ఎక్సైజ్ సీఐ యశోదర దేవి రాబట్టిన సమా చారం మేరకు ఎస్‌ఐలను, సిబ్బందిని ప్రత్యేక ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. శివకృష్ణ, వాసుదేవరావు, ఆనందరావుల వద్ద 133 గోవా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు అరుణ్ కుమారి తెలిపారు.



నిందితులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ శాఖ గుంటూరు ఈఎస్ అరుణ కుమారి, టూ టౌన్ సీఐ యశోదరదేవి, సిబ్బంది



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

జనవరి 30న విజ్ఞాన్ ఫార్మసీలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్

గుంటూరు(విద్య),డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో జనవరి 30 నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తు న్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాసబాబు మంగళ వారం తెలి పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రౌచర్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్, ఫ్యూచరిస్టిక్ అప్రోచ్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రేమ,శాంతి, సమభావనలకు ప్రతీక క్రిస్మస్

- ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రేమ,శాంతి సమ భావాలను కలిగి ఉండాలన్నదే క్రిస్మస్ పర్వదినం సందేశమని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా వినుకొండ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ పై ఆశలతో కొత్త సంకల్పాలతో కూడా రానున్న కొత్త ఏడాదిని స్వాగతించాలని కోరారు. రాష్ట్ర ప్రజలంత మనమంత ఒక కుటుంబమనే భావణతో శాంతి, సామరస్యాలతో కలిసి ఉండి ఒకొరికొకరు సహాయపడుతూ కలిసి పురోగమించాలని ఆకాంక్షించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్లరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 575.70 అడు గులు ఉంది. ఇది 270.87 టీఎం సీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8717 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7937 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20790 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 40,144 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,931 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టంలో తప్పుడు సమాచారం

- పల్నాడు ఎక్స్‌ప్రెస్ మంగళవారం రాత్రి గంటకు పైగా ఆలస్యం
- అయినప్పటికీ 15 నిమిషాలు ముందుగానే వచ్చినట్లు నమోదు

గుంటూరు, డిసెంబరు. 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారిక నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టం(ఎన్‌టీఈఎస్)లో అధికారులు తప్పుడు సమాచారాన్ని నమోదు చేస్తున్నారు. మంగళవారం నంబరు. 12748 వికారబాద్ - గుంటూరు పల్నాడు సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ గంటకు పైగా ఆలస్యంగా గుంటూరుకు చేరుకుంది. అయితే, ఈ రైలు నిర్ణీత సమయం రాత్రి 9.05 కంటే 15 నిమిషాల ముందుగానే అంటే 8.50కే గుంటూరుకు చేరినట్లు నివేదించారు. దీనిపై రైలులో ప్రయాణించిన ప్యాసింజర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ అయి ఉండి గంటకు పైగా ఆలస్యంగా గమ్యస్థానానికి చేర్చినందుకు సిగ్గుపడాల్సిందిపోయి అందరిని తప్పుదోవ పట్టిస్తూ 15 నిమిషాలు ముందుగా చేరినట్లు నమోదు చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్వీట్లు చేశారు. దీనిపై బుధవారం రైల్వే జీఎం, డీఆర్‌ఎంకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్ పై వేటు

నరసరావుపేట లీగల్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి) : విధుల్లో అలసత్వం, నిధుల దుర్వినియోగం తదితర ఆరోపణలపై నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విధుల నుంచి ఆయనను తప్పించింది. నాయక్ స్థానంలో ప్రస్తుత డీసీహెచ్ ఎస్ డాక్టర్ రంగారావుకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసీపీ హయాంలో ఆస్పత్రిలో బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై వైద్య ఆరోగ్య శాఖ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్టు గుర్తించింది. దీంతో నాయక్‌పై చర్యలు తీసుకున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

వీఆర్‌కు మాచర్ల రూరల్ ఎస్‌ఐ నారాయణ

- ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి మెమో జారీ



మాచర్లటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాచర్ల రూరల్ ఎస్‌ఐ నారాయణకు ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి చార్జ్‌మెమో జారీ చేశారు. గతంలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం ఎస్‌ఐగా నారాయణ విధులు నిర్వహించారు. 2023వ సంవత్సరంలో కారు, బైకు ఢీ కొన్న సంఘటనలో ద్విచక్ర వాహనచోదకుని కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు రాజుపాలెం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో హెడ్ కానిస్టేబుల్‌గా ఉన్న పుల్లారావు ఈ విషయ్నాన ఎస్‌ఐ నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. బాధితుడికి రూ. 3 లక్షలు ఇచ్చేలా పోలీస్‌స్టేషన్‌లో సెటిల్‌మెంట్ చేశారు. అయితే, బాధితుడికి ఆ నగదు ఇవ్వలేదు. కాళ్లకు గాయం నయం కాకపోవడంతో బాధితుడు నడవలేని స్థితికి చేరుకున్నాడు. దీంతో, బాధితుడు ఇటీవల ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు విచారణ జరపగా కారు, బైకు ఢీకొన్న సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని తేలింది. దీనికి తోడు పోలీసుల సమక్షంలోనే సెటిల్‌మెంట్ జరగడం వంటి విషయాలను ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్‌ఐ నారాయణకు చార్జ్‌మెమో జారీ చేసి వీఆర్‌కు పంపారు. ఇన్ చార్జి ఎస్‌ఐగా ఏఎస్‌ఐ రఫీ వ్యవహరిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	102,110,122
చికెన్ విత్ స్కిన్	196.00
చికెన్ స్కిన్ లెస్	206.00

ముగిసిన కౌన్సెలింగ్

- కార్పొరేషన్ 8, మున్సిపాల్టీల్లో 10 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

గుంటూరు(విద్య),డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో మున్సిపల్,కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపా ధ్యాయులకు మంగళవారం పదోన్నతుల కౌన్సిలింగ్‌ను డీఈవో కార్యాలయంలో నిర్వహించారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసి స్టెంట్స్‌గా పదోన్నతులు కల్పించినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో తెలుగు -,3 ఇంగ్లీషు- 2, సోషల్ 1, హిందీ 2 చొప్పు మొత్తం మందికి పదోన్నతులు కల్పించారు. మున్సిపల్ పాఠశాలల పరి ధిలో ఇంగ్లీషు 1, ఫిజికల్ సైన్స్ 1, బయాలజీ 2, సోషల్ 4, లెక్కలు 2 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతులు కల్పించినట్లు వెల్ల డించారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విద్యాభివృద్ధి, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఏ తిరుమలేష్, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు జే రమేష్‌కుమార్, ఉర్దూ డీఐ ఎస్‌కె ఎండీ ఖాసిం, ఎంఈవో ఎండీ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నియామకపత్రం అందజేస్తున్న డీఈవో సీవీ రేణుక తదితరులు



నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యంపై పట్టాలు కప్పిన రైతులు


వాయు'గండం'

(5వ పేజీ తరువాయి)

అంతంతమాత్రంగా ఉన్న పరిస్థితుల్లో వరుస అల్పపీడనాలు తమను కుదేలు చేయడమే కాకుండా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కొన్నిచోట్ల పూర్తిగా ఆరిపోయిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించడంలో ఆలస్యం కావడంతో గోతాలకెత్తి పట్టాలు కప్పిన బస్తాలు కూడా కింది నుంచి నీటి చెమ్మ చేరడంతో తడిచాయని రైతులు తెలిపారు. ఖరీఫ్ సాగు నుంచి గట్టెక్కి, రబీ కింద మొక్కజొన్న, మినుము విత్తనాలు ఈ రెండు రోజుల్లో వేసిన రైతులకూ నష్టం తప్పలేదు. వర్షంతో విత్తు కుళ్లిపోతోందని రైతుల ఆవేదన చెందుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చేసిన ప్రకటన రైతుల కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. కొన్ని పొలాల్లో కోతలు కోసి వరి ఓదెల మీద ఉన్నాయి. వాతావరణంలో మార్పులతో ఒక్కసారిగా కూలీలకు డిమాండ్ పెరిగి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కవారంరోజుల పాటు వర్షం పడకుండా ఉంటే రైతులు పూర్తిగా కోలుకుంటారని తెలుపుతున్నారు. పల్నాడు జిల్లాలో భారీ వర్షాలతో పత్తి పంట పూర్తిగా కుళ్లి నష్టపోయామని ధాన్యం కొంతమేర సంతృప్తి చెందుతుందనే దశలో అకాల వర్షం నష్ట పరుస్తుందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

నాలుగో రోజూ.. మూడో నంబరు హెచ్చరిక

వాయుగుండం ప్రభావంతో నిజాంపట్నం హార్బర్‌లో మూడో నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. నాలుగు రోజుల క్రితం ఈ హెచ్చరికను ఎగురవేసినప్పుడు వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఎండ కూడా ఉండటంతో వాయుగుండం ఉండ దని అంతా భావించారు. అయితే వాతావరణ శాఖ ముందే హెచ్చరించినట్లు మంగళవారానికి వాతావరణంలో మార్పులు చోటు చేసు కున్నాయి. సముద్రంలో వేటకు వెళ్లిన పడవలు ఒడ్డుకు చేరిపోయాచి. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చిన్న బోట్లు వారు వేటకు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీచేశారు.



నిజాంపట్నం హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద సూచిక ఎగురవేత

73,529 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 76,386 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 73,529 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,093 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	8000	15000
నెంబరు. 5	9000	14000	నెంబరు.5	8500	11800
273	8500	11700	273	10500	10500
341	8500	15000	341	8000	13000
4884	13500	13500	4884	11000	12000
సూపర్ 10	10000	13500	సూపర్ 10	15500	15500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16300	తేజ	7600	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	12000
దేవనూరు డీలక్స్	9000	15000	దేవనూరు డీలక్స్	8500	13000
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4000	10500

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

● ఎన్‌సీఆర్‌డీ కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



కలెక్టరేట్‌లో జరిగిన ఎన్‌సీఆర్‌డీ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలు అరికట్టేందుకు ఎన్‌సీఆర్‌డీ కమిటీలోని అధికారులందరూ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సమన్వయంతో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా స్థాయి ఎన్‌సీఆర్‌డీ కమిటీ(డగ్స్, మాదక ద్రవ్యాలు అరికట్టడం) సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంస్థలు, వాటి పరిసరాల్లో మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలను అరికట్టడం, సంక్షేమ శాఖ వసతి గృహాలలో పర్యవేక్షణ కోసం సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లోకి బయట వ్యక్తులు రాకుండా, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాలు అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు, నమోదు చేసిన కేసులు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలను క్రైం హాట్ స్పాట్‌గా గుర్తించి పోలీసులతో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, డీఈవో రేణుక, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ మహబూబ్ షరీఫ్, సాంఘీక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, డ్రగ్ కంట్రోల్ ఏడీ లక్ష్మణ్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దుర్గాబాయి, జీఆర్పీ డీఎస్పీలు జయరాం, మల్లికార్జునరావు, అజీజ్, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, పోలీస్, రైల్వే తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు నేతల క్రిస్మస్ శుభాకాంక్షలు

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర ప్రజలకు ఎమ్మెల్యే గళ్లా మాధవి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్ తన జీవితం ద్వారా సన్మార్గానికి బాటలు వేశారని, ప్రపంచానికి ప్రేమ, సహనం, త్యాగం, క్షమాగుణం క్రీస్తు ఇచ్చిన సందేశాలన్నారు.

● నగర ప్రజలకు తూర్పు ఎమ్మెల్యే నసీర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు ప్రపంచ సర్వమత శాంతిస్థాపన కొరకు పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతిదూత అని అన్నారు. క్రీస్తు బోధనలు పాటిస్తే సమాజం ఆనందదాయకంగా ఉంటుందన్నారు.

● గుంటూరు నగర ప్రజలకు టీడీపీ నగర అధ్యక్షుడు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

పెరియార్ రామస్వామికి నివాళి

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలని తొలిసారిగా పార్లమెంటులో చట్టసవరణ చేసిన సామాజిక ఉద్యమకారుడు పెరియార్ రామస్వామిని జాతి మరువదని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. పాతగుంటూరులోని కార్యాలయంలో మంగళవారం పెరియార్ రామస్వామి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో వట్టికూటి సాంబయ్య, జీఆర్ భగత్‌సింగ్, పీ.సురేష్ తదితరులున్నారు.

27 నుంచి పౌరాణిక నాటక ప్రదర్శనలు

గుంటూరు (తూర్పు) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 27, 28 రెండు రోజులు పాటు పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. విజ్ఞాన మందిర్ ప్రాంగణంలో నాటక ప్రదర్శనలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. సమావేశంలో కృష్ణారావు, ఎస్.సాంబశివరావు, డాక్టర్ బీవీ రమణ, శ్రీకాంత్, సూర్యనారాయణ, వెంకటప్పయ్య, అర్జునరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావం వల్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో వర్ష ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులను ఆదేశించామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు వర్ష ప్రభావంతో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103కి కాల్ చేయవచ్చని తెలిపారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక లాడ్జి సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది వైకె మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు మాట్లాడుతూ అమిత్‌షా తన పదవికి రాజీనామా చేసి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. నిరసనల్లో మణికుమారి, సీహెచ్ వాసు, ఓర్సు ప్రేమ్‌రాజ్, నల్లపు నీలంబరం, పాగళ్ల ప్రకాష్, సాదు మాల్యాద్రి, ఘంటా ప్రభుదాస్, బత్తుల వీరా స్వామి పాల్గొన్నారు.

క్షమాగుణాన్ని అలవర్చుకోవాలి : మంగాదేవి

గుంటూరు(విద్య), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతివారు ప్రేమ తత్వాన్ని, క్షమాగుణాన్ని అలవర్చుకోవాలని బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి అన్నారు. శ్రీవెంకటేశ్వర బాలకుటీర్, చేతన చౌడవరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. డాక్టర్ ఎస్.మంగాదేవి మాట్లాడుతూ ప్రేమ, దయ, సహనం, శాంతి కలిగి ఉండాలని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నతుడు ఏసుక్రీస్తు అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేతనా కార్యనిర్వాహకురాలు మరుద్వతి పాల్గొన్నారు.

కన్నా పాఠశాలలో...

గుంటూరు(తూర్పు), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీకాలనీలోని కన్నా హైస్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కన్నా విద్యాసంస్థల అధినేత కన్నా మాస్టర్ మాట్లాడుతూ సకల మానవాళి సుఖ సంతోషాలు, శాంతి సమాధానాలతో వెలుగొందాలనే జీసస్ పుట్టినరోజును క్రిస్మస్ పర్వదినంగా జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి రాజేశ్వరీదేవి, ప్రిన్సిపాల్ తనూజ, స్టాప్ ఇన్‌చార్జ్ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ బాక్సులు చోరీ

గుంటూరు, డిసెంబరు 24: స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలకలూరు రోడ్‌లో గల పద్మిని కృష్ణ కల్యాణ మండపం సమీపంలో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్ విద్యుత్ వైర్ల బాక్సుల చోరీ జరిగింది. రూ.లక్ష ఖరీదైన వంద బాక్సులను దుండగులు అపహరించుకుపోయారు. ఈ నెల 8 రాత్రి ఈ చోరీ జరిగింది. మండపం నిర్వాహకుడు కోట వెంకట హరీష్ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలం వద్ద మహిళపై అత్యాచారయత్నం

ఒంటరిగా పొలానికి వెళ్లిన ఓ మహిళపై పక్క పొలానికి చెందిన రైతు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు రూరల్‌కు చెందిన మహిళ ఈనెల 15న తన పొలంలో పనులకు వెళ్లగా పక్క పొలానికి చెందిన తోకల శివనాగమల్లేశ్వరరావు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చర్చిల్లో భక్తి శ్రద్ధలతో పూజలు

● భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

● లోకరక్షణకే క్రీస్తు జననమని గురువుల సందేశం

గుంటూరు, డిసెంబరు 24: నగర పరిధిలోని చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన క్రిస్మస్ పూజల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ భక్తులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. లోక శాంతి, పాప పరిహారం, సర్వమానవాళి రక్షణ కోసమే క్రీస్తు ఈ లోకంలో జన్మించారని గురువులు, పాస్టర్లు సందేశమిచ్చారు. సర్వమానవాళి సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ దేవాలయంలో విచారణ గురువు ఫాదర్ చిన్నయ్య ఆధ్వర్యంలో అర్ధరాత్రి పూజలు జరిగాయి. రింగ్‌రోడ్డులోని నిత్య సహాయ మాత ఆలయంలో ఫాదర్ చిన్నాబత్తుని లూయిస్ పూజలో పాల్గొన్నారు. స్తంభాలగరువులోని ఆగ్లియం స్కూల్‌లోని దివ్య బాలయేసు దేవాలయంలో ఫాదర్ పుట్టి సుందరరాజు ఆధ్వర్యంలో అర్ధరాత్రి పూజ జరిగింది. నగరంపాలెంలోని పునీత అంతోని వారి దేవాలయంలో విచారణ ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు, సహాయ గురువు శ్రీకాంత్ ఆధ్వర్యంలో అర్ధరాత్రి పూజ జరిగింది. గోరంట్లలోని ఆరోగ్య మాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ నరిశెట్టి బాలశౌరి ఆధ్వర్యంలో, అమరావతి రోడ్డులోని వెళాంగిణి మాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ ఇన్నారెడ్డి, బొంగరాలబీడులోని లూర్దు మాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ అబ్రహం, మంగళదాస్‌నగర్‌లోని లూర్దుమాత ఆలయంలో విచారణ గురువులు కసిరెడ్డి జోసఫ్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. లాడ్జి సెంటర్‌లోని నార్త్ ప్యారిస్ చర్చిలో బాబూరావు, జేమ్స్ సుధీర్, శ్యామ్యూల్‌జాన్, పురుషోత్తం చౌదరి, కిరణ్‌కుమార్, మధుబాబు, షాలేమ్ ప్రార్థనలు జరిగాయి. వెస్ట్ ప్యారిస్ చర్చిలో పాస్టర్లు సతీష్, మాణిక్యారావు, యువరాజ్, సెంట్రల్ గుంటూరు సెనెడ్ బిషప్ శాంతారావు తదితరులు క్రిస్మస్ సందేశం ఇచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్ట్ ప్యారిస్ చర్చిలో పాస్టర్లు చక్రధర్, ఆదాం, విక్టర్, ప్రేమ్‌సాగర్ అర్ధరాత్రి ప్రార్థనలు చేశారు. ఏటి అగ్రహారంలోని సౌత్ ప్యారిస్ చర్చిలో సురేష్‌బాబు, కొత్తపేట కుగ్లర్ ఆసుపత్రి ఆవరణలోని ట్రినిటి ప్యారిస్‌లో దైవాశీర్వాదం, రమేష్, లెనిన్, మాన్యం చర్చిలో పాస్టర్ గొట్టిపాటి భాస్కర్‌రావు ప్రార్థనల్లో పాల్గొన్నారు.



బాల ఏసుతో...



ప్రార్థనలు నిర్వహిస్తున్న సిస్టర్లు

ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన వైసీపీ సర్కార్

● మన్నవ మోహనకృష్ణ



ప్రజావేదికలో వినతులు స్వీకరిస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'ప్రజావేదిక' కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ మంతెన రామరాజుతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాసమస్యలను గాలికి వదిలేసి ప్రజలను తీవ్ర ఇబ్బందికి గురిచేశారని విమర్శించారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, ప్రజాసమస్యల పరిష్కార దిశగా పనిచేస్తుందని మన్నవ మోహనకృష్ణ తెలిపారు.

వినియోగదారుల పోరాటాలకు చట్టం రక్షణ : జేసీ

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తాము కొనే వస్తువు, పొందే సేవ చిన్నదైనా, పెద్దదైనా ఖచ్చితమైన నాణ్యత కలిగి ఉండేలా చూసుకోవాలని జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం-2024 కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాలులో మంగళవారం జరిగింది. జేసీ మాట్లాడుతూ తమకు ఎలాంటి మోసం జరిగిందని గ్రహిస్తే వెంటనే వినియోగదారుల కమిషన్‌లో కేసు నమోదు చేయాలని సూచించారు. ఫోరం ప్రెసిడెంట్ సునీత మాట్లాడుతూ వినియోగదారులు తాము కొన్న వస్తువులు, పొందిన సేవల విషయంలో మోసపోయిన సందర్భాలలో జిల్లా వినియోగదారుల ఫోరం, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించి కేసు ఫైల్ చేసి సత్వర న్యాయం పొందవచ్చు అన్నారు. వినియోగదారుడు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త వినియోగదారుల రక్షణ చట్టం-2019పై అవగాహన పెంచుకుని తద్వారా మోసపూరిత వ్యాపార విధానాల నుంచి తనని తాను రక్షించుకోవాలని ఫోరం మెంబర్ విజయలక్ష్మి సూచించారు. అనంతరం తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషలలో వ్యాసరచన, వక్తృత్వం పోటీలలో విజేతలైన హైస్కూల్, కాలేజీ విద్యార్థులు 36 మందికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులుగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి ప్రశంసా పత్రం, జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి పీ.కోమలి పద్మ, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ లక్ష్మి, జిల్లా తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు, ఆహార భద్రత శాఖ జిల్లా అధికారి రవీంద్రరెడ్డి, డ్రగ్ కంట్రోలర్ లక్ష్మణ్, ప్రభుత్వ రంగ చమురు సంస్థల తరుపున సేల్స్ ఆఫీసర్స్, వినియోగదారుల అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ ఆదాం సాహెబ్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి జన్మదిన వేడుకలు



రాయపాటి శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే నసీర్, కూటమి నేతలు

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ 77వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. గుంటూరులోని ఆయన స్వగృహంలో మంగళవారం జరిగిన వేడుకల్లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు పాల్గొన్నారు. రాయపాటి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను రాయపాటి శ్రీనివాస్ కట్ చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, జనసేన నాయకుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, టీ.కేశవ యాదవ్, అంజనేయులు, రాజా సిద్దార్థ, షేక్ గౌస్ మొయినుద్దీన్, రాజపుత్ర సత్యం సింగ్, మర్రి శివయ్య, కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు గాంధీ చౌదరి, సౌరయ్య, రాయపాటి అమృతరావు, టీడీపీ నాయకులు కసుకుర్తి హనుమంతరావు, షేక్ జిలాని, సూర్యదేవర రవి, పార్థసారథి, ప్రసాద్, పాతూరి రమేష్, జైహింద్ కిలారి తదితరులున్నారు.

● మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రాజపుత్ర సత్యం సింగ్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలో గల శ్రీ షిరిడి సాయి దీనజన సేవ సమితిలోని అంధ విద్యార్థుల మధ్య డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. పండ్లు అందజేశారు.

కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ కృష్ణప్రసాద్

గుంటూరు(విద్య),డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆనంద్ చెస్ వింగ్స్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారని కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-9 బాలుర విభాగంలో ప్రణీత్ శ్రీనివాస్ 6వ స్థానం, అండర్-11 బాలుర విభాగంలో ప్రణిత్య, అండర్ -11 బాలికల విభాగంలో సహస్ర 5వ స్థానం, అండర్-13 బాలుర విభాగంలో పీవీ యశ్వంత్ 5వ స్థానం కైవసం చేసుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ జి.రత్తయ్య అభినందించారు.

కేఎల్‌పీ పాఠశాలలో సెమీ క్రిస్మస్ సంబరాలు

స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు పాఠశాలలో నిర్వహించడం విద్యార్థులలో మానవత్వ విలువలు వికసిస్తాయని తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ టీమ్‌కు విజ్ఞాన్ నిరులా విద్యార్థిని ఎంపిక

గుంటూరు(విద్య), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జెఎన్‌టియూ, కాకినాడ సౌత్ జోన్ వాలీబాల్ టీంకు విజ్ఞాన్ నిరూల విద్యార్థిని ఎంపిక కావడంతోపాటు, పోటీలలో కళాశాల టీం తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక మంగళవారం తెలిపారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్య అభ్యసిస్తున్న నెక్కల మాలతి సౌత్ జోన్ వాలీబాల్ టీంకు ఎంపికైనట్లు చెప్పారు. మాలతికి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, అధ్యాపకులు డాక్టర్ జి. సంధ్య, ఫిజికల్ డైరెక్టర్ కిషోర్ కుమార్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. హరీష్ అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలలో నులకపేట జడ్పీ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

గుంటూరు(విద్య),డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో నులకపేట జడ్పీ స్కూల్ విద్యార్థిని బి.మేఘన జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు షేక్ షాహిద్‌ఆలీ వెల్లడించారు. కలెక్టరేట్లో విజేతలకు రూ.1500 నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, మెమోంటోను జాయింట్ కలెక్టర్ రంజిత్ భార్గవ్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి సివి రేణుక విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ విద్యా శాఖ అధికారి జి.శాంతకుమారి, గుంటూరు రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఉర్దూ) ఎం.డి ఖాసిం, మండల విద్యాశాఖ అధికారి డి.నాగేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వనజ కుమారి పాల్గొన్నారు.

వెంగళరావునగర్ మున్సిపల్ స్కూల్ విద్యార్థిని..

గుంటూరు వెంగళరావు కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థిని మేడిద లాస్యకు జాతీయ వినియోగదారుల దినోత్సవం 2024 సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో మూడవ బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం రమేష్ తెలిపారు. జేసీ భార్గవ్ తేజ నుంచి సివిల్ సప్లయి ఆధ్వర్యంలో రూ. 1500 నగదు సర్టిఫికెట్ అందజేశారని చెప్పారు.

అభాగ్యుల జీవితాల్లో వెలుగు నింపుతున్న సీఎం సహాయ నిధి

● ఎమ్మెల్యే నసీర్



సీఎం సహాయనిధి పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న అభాగ్యుల జీవితాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సీఎం సహాయనిధి వెలుగులు నింపుతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. నియోజకవర్గంలోని పలువురు బాధితులకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో సీఎం సహాయనిధి పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదలకు ఆపన్న హస్తం అందేలా చర్యలు తీసుకుంటున్నారని, గడిచిన ఆరు నెలల్లో నియోజకవర్గంలో రూ.80 లక్షలు సీఎం సహాయనిధి చెక్కులను అందించి పేద ప్రజలకు అండగా నిలిచామని నసీర్ చెప్పారు. తాజాగా సుమారు రూ.21 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందించామన్నారు.

ఉపాధి కల్పన లక్ష్యంగా పనిచేస్తా

● ఎమ్మెల్యే మాధవి



జాబ్‌మేళాలో పాల్గొన్న యువతను ఇంటర్వ్యూ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో 'హెచ్‌ఆర్ అండ్ కో' సంస్థ సహకారంతో ఆమె ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు యాక్సిస్ ఎన్ఐబిటీ, టాటా, పేటియం, జస్ట్ డయల్, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకు, ఆదిత్య బిర్లా క్యాపిటల్, ఫెయిర్ డీల్ క్యాపిటల్, రాజ్ గ్రూప్స్, ఎస్‌బీఐ లైఫ్, టాటా ఏ.ఐ.ఏ, యస్.బీ.ఐ క్రెడిట్ కార్డ్స్ సంస్థలు హాజరయ్యాయి. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఒక మెగా జాబ్, నాలుగు మినీ జాబ్ మేళాలు నిర్వహించామని, తద్వారా అనేక మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు.

'వై నాట్ 175'ని గుర్తుకు తెస్తున్న సజ్జల వ్యాఖ్యలు

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి




మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు సబ్ జైలు వద్ద సజ్జల ఉత్తరకుమార ప్రగల్భాలు నాడు జగన్ మాట్లాడిన 'వై నాట్ 175' ని గుర్తుకు తెస్తున్నాయని ప్రజలు నవ్వుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సొంత పార్టీ అధినేత తల్లీ, చెల్లెళ్లపైనే అతి జుగుప్సాకరంగా పోస్టులు పెట్టిన తన పుత్రరత్నం భార్గవరెడ్డి నీచమైన చరిత్ర గురించి కూడా ప్రజలకు వివరణ ఇస్తే బాగుండేదని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డికి సూచించారు. మాజీ ఎంపీ రఘురామ కృష్ణంరాజుని ఏ జైల్లో అయితే రెండు రోజులు అక్రమంగా నిర్బంధించారో, ఆయనపై కస్టోడియల్ టార్చర్‌కి పాల్పడ్డ అదనపు ఎస్పీ విజయపాల్ అదే జైల్లో నెలల తరబడి మగ్గుతున్నాడని, అలానే రాజధాని రైతులను అదే జైల్లో పెట్టించిన మాజీ ఎంపీ నందిగం సురేశ్ కూడా అక్కడే మగ్గిపోవటం చూసైనా 'విధి ఎవరినీ వదిలిపెట్టదన్న' విషయాన్ని సజ్జల తెలుసుకోవాలన్నారు. మాజీ మంత్రి రజిని ప్రజల నుంచి దోచుకున్న అవినీతి సొమ్ములో వాటాలు తీసుకున్న సజ్జల జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో మద్దిరాల మ్యానీ పాల్గొన్నారు.

క్రిస్మస్ కాంతులు

పండుగకు సర్వం సిద్ధం


తెనాలి ఐతానగర్ క్రీస్తు కృపాలయం


క్రిస్మస్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. పల్లె పట్టణం అన్న తేడా లేకుండా అంతటా క్రిస్మస్ సందడి మంగళవారం రాత్రి నుంచే సంతరించుకుంది. ప్రధాన చర్చిలతో పాటు కాలనీల్లో, పల్లెల్లోని చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. విద్యుత్ వెలుగుల్లో చర్చిలు కాంతులీనుతున్నాయి. ఆయా చర్చిల్లో క్యాండిల్ లైటింగ్ కార్యక్రమాలు మంగళవారం అర్ధరాత్రి అత్యద్భుతంగా జరిగాయి. చిన్న పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. క్రీస్తు పుట్టుక నాటకం సభికులను అకట్టుకున్నది. క్రిస్మస్ స్టార్లు, ట్రీలు, వివిధ అలంకరణలతో చర్చి ప్రాంగణాలు మిరుమిట్లుగొల్పుతున్నాయి. క్రీస్తు ప్రభువు తమ ఇంట జన్మించాడని ప్రతీకగా నక్షత్రాన్ని ప్రతీ ఇంటిపైన, ప్రధాన కూడళ్లలో వేలాడదీశారు. క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ టోపీలు, కోట్లు, క్రిస్మస్ ట్రీలకు అలంకరించే కానుకల బాక్సుల అమ్మకాలు ముమ్మరంగా జరిగాయి. ఇక అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులంతా ఆనందంగా పండుగను జరుపు కోవాలని, అందరి గృహాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. బుధవారం జరిగే ప్రార్థనలకు పలు చర్చిల్లో ఏర్పాట్లు జరిగాయి.


సత్తెనపల్లి పట్టణంలో చర్చి వద్ద అలంకరించిన క్రిస్మస్ స్టార్


కాంతులీనుతున్న పాతపాడూరు క్రీస్తు శతవార్షిక లూథరన్ చర్చి


విద్యుత్ దీపాలంకరణతో వెలుగులీనుతున్న తాడికొండలోని తెలుగు బాపిస్టు చర్చి


నరసరావుపేట రోడ్డు రహదారిపై విద్యుత్ కాంతులతో అలంకరించిన చర్చి


విద్యుత్ కాంతుల వెలుగుల్లో మెరిసిపోతున్న పెదనందిపాడు లూథరన్ చర్చి


నరసరావుపేట లోని విద్యుత్ దీపాలు అలంకరించిన హర్ట్ స్కూల్‌లోని చర్చి


విద్యుత్ కాంతులతో రెంటచింతల పట్టణంలో 1903లో నిర్మించిన లూథరన్ చర్చి

రేషన్ డీలర్ల ఖాళీల భర్తీపై
దోబూచులాట

- గుంటూరు ఆర్‌డీవో పరిధిలో 66 షాపుల భర్తీకి నోటిఫికేషన్
- అందులో కనిపించని గుంటూరు వెస్టులోని ఖాళీలు

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల ఖాళీల భర్తీపై రెవెన్యూ అధికారులు, దుకాణాదారులు దోబూచులాడు కుంటున్నారు. ఒక స్పష్టమైన విధానం అంటూ లేకుండా నోటిఫికేషన్లు జారీ చేయడం, ఆ తర్వాత నిలిపేయడం, మళ్లీ ఖాళీల భర్తీ అంటూ ప్రకటన ఇవ్వడం, వాటిల్లో కొన్ని షాపులను తొలగించడం చేస్తూ అయోమ యానికి గురి చేస్తున్నారు. దుకాణాల విభజన హేతుబద్ధం కాదంటూ కోర్టుల్లో కేసులు వేసిన వారివి కూడా ఖాళీల్లోకి తీసుకురాలేదు.

గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 66 రేషన్ డీలర్ల నియామకానికి ఆర్‌డీవో శ్రీనివాస రావు నోటిఫికేషన్ విడుదల చేశారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని, ఆసక్తి కలిగిన వారు జనవరి 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నేరుగా/రిజిష్టర్ పోస్టు ద్వారా తమ కార్యాలయానికి అందేలా చూడాలన్నారు. 9వ తేదీ రాత పరీక్ష నిర్వహించి అదే రోజు ఒక్కో ఖాళీకి ఐదుగురిని ఎంపిక చేస్తారు. 10వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్‌డీవో కార్యాల యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి వారిలో ఒక్కో దుకాణానికి ఒకరిని ఎంపిక చేస్తారు. అర్జీ నమూన సంబంధిత తహసీల్దార్ కార్యాలయా ల్లోనూ అందుబాటులో ఉంచామన్నారు. అయితే ఈ ఖాళీలను ఎమ్మెల్యేలు ఎవరి పేర్లు అయితే సూచిస్తారో వారికే కేటాయిస్తారన్న విషయం బహిరంగ రహస్యమే.

గత కొన్నేళ్లలో కొంతమంది రేషన్‌డీలర్లు తమ పలుకుబడిని ఉపయోగించుకొని ఒక్కో దుకాణం లో 800లకు పైగా రేషన్‌కార్డులు మంజూరు చేయించుకొన్నారు. మరోవైపు కొన్ని దుకాణాల్లో 400 కార్డులు కూడా లేని పరిస్థితి. వీటన్నింటిని సరి చేయాలంటే తొలుత రేషన్ షాపుల రేషనలైజేషన్ చేయాలి. అయితే దాని జోలికి పోకుండా పౌరసరఫరాల శాఖ కమిషనరేట్ అధికారులు షాపుల విభజన చేపట్టారు. 800, అంతకంటే ఎక్కువ రేషన్ కార్డులు గుంటూరు నగర పరిధిలో ఏదైనా షాపులో ఉంటే 600లకు తగ్గించాలని ఆదేశిం చారు. అదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే షాపు నకు 400 కార్డులకు పరిమితం చేయాల న్నారు. నగరంలో ఏ ఒక్క దుకాణంలోనైనా 799 కార్డులున్నా కదిలించొద్ద న్నారు. దీనిపై పౌరసరఫరాల డీలర్లు అభ్యం తరం పెడుతూ హైకోర్టును ఆశ్రయించారు. దాంతో గత రెండు నెలల నుంచి రేషన్ షాపుల విభజన ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా న్యాయ సలహా తీసు కొన్న రెవెన్యూ అధికారులు ఎవరైతే హైకోర్టుని ఆశ్రయించారో వారివి పక్కన పెట్టి మిగతా షాపుల విభజనకు పూనుకొన్నారు.

ప్రత్తిపాడు మండలంలోని పాతమల్లాయ పాలెం, వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపా డులో 2, చమళ్లమూడి, గుంటూరు ఈస్టు (రూరల్)లో బుడంపాడు, ఏటుకూరు, గోరంట్ల లో 4, నగరాలులో రెండు, జొన్నలగడ్డ, రెడ్డిపా లెంలో రెండు, గుంటూరు పశ్చిమ (రూరల్)లో అడవి తక్కెళ్లపాడులో 4, చల్లావారి పాలెంలో రెండు, చినపలకలూరు, చౌడవరంలో నాలుగు, లాలుపురం, నల్లపాడు, పెదపలకలూరు, వెంగ ళాయపాలెంలో మూడు, తుళ్లూరు మండలం లోని తుళ్లూరు, రాయపూడిలో రెండు, మంద డం-2, హరిశ్చంద్రాపురం, బోరుపాలెం, దొండ పాడు కలిపి ఒకటి, మేడికొండూరు మండలం లోని పేరేచర్లలో ఆరు, గుంటూరు పశ్చిమ మండలంలోని స్వర్ణభారతీనగర్, గుంటూరు ఈస్టులోని ఎల్ఆర్ కాలనీ, ఎన్‌టీఆర్ నగర్, ఇందిరాకాలనీ, సీతానగర్, శ్రీనగర్, మంగళ దాసునగర్, నల్లచెరువు, చాకలిగుంట, ఏటుకూరు రోడ్డు, సూరానగర్, ఆలీనగర్, ఆనందపేట, బాలాజీనగర్, ఏకావారివీధి, బుచ్చయ్యతోట, పాదర్తి వారి వీధి చక్కల బజారు, మంత్రివారి వీధి, క్రిష్టియన్‌పేట రెడ్లబజారు, యాదవబాజారు యాదవహై స్కూల్ లక్ష్మీనగర్, ఆర్‌టీసీ కాలనీ మణిపురం, నల్లచెరువు, నందివెలుగురోడ్డు ఆర్‌టీసీ కాలనీ, రామిరెడ్డి తోట, డొంకరోడ్డు మల్లికార్జునపేట లోని రేషన్ దుకాణాలను ఖాళీగా చూపించి డీలర్ల ఎంపికకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి నగర పరిధిలో ఒక్క రేషన్ దుకాణం కూడా చూపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. దీనిపై తాము హైకోర్టుని ఆశ్రయిస్తామని డీలర్ల సంఘం నాయకులు తెలిపారు.

గుంటూరు - నడికుడి సెక్షన్‌లో పెరిగిన రైళ్ల క్రాసింగ్‌లు

- ప్యాసింజర్ రైళ్ల సమయ పాలనపై ప్రభావం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లలో రైళ్ల సంఖ్య పెరగడంతో గుంటూరు - నడికుడి సెక్షన్‌లో క్రాసింగ్‌ల సంఖ్య పెరిగిపోయింది. ఒకప్పుడు ఈ సెక్షన్‌లో ఒకటి, రెండు రైళ్లు మాత్రమే ప్యాసింజర్‌లకు ఎదురయ్యేవి. నేడు సూపర్‌ఫాస్టు, వందేభారత్ రైళ్లు క్రాసింగ్‌లు ఉండటంతో నిబంధనల ప్రకారం ప్యాసింజర్ రైళ్లని ఏదైనా స్టేషన్‌లో లూప్‌లైన్‌లో పెట్టక తప్పని పరిస్థితి. దీంతో ప్రయాణ సమయాన్ని రైల్వే శాఖ పెంచు కుంటూ పోంది. ప్రధానంగా గుంటూరు - మాచర్ల, మాచర్ల - గుంటూరు మధ్యన ప్రయాణించే రైళ్లపై సమయపాలన ప్రభావం పడుతున్నది. దీంతో రైలు ప్రయాణీకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం గుంటూరు - మాచర్ల మధ్యన రెండు రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిల్లో మొదటి రైలు నంబరు. 07779 గుంటూరు - మాచర్ల ప్యాసింజర్ ఉదయం 8 గంటలకు బయలుదేరి 11.40కి మాచర్లకు చేరుకొంటుంది. గతంలో ఈ రైలుకు కేవం మాచర్ల - బీమవరం ప్యాసింజర్ రైలుతో మాత్రమే క్రాసింగ్ ఉండేది. అలాంటి నేడు ఎల్‌టీటీ, విజయవాడ, ఇంటర్‌సిటీ, వందేభారత్, జన్మభూమి, భావనగర్ రైళ్లతో క్రాసింగ్ ఉన్నది. దీని వలన గమ్యస్థానానికి చేరుకోవడం ఆలస్యం అవుతుండటంతో జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న టైంటేబుల్‌లో 30 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయించారు. దీని వలన ఈ రైలు మధ్యాహ్నం 12.10కి మాచర్ల చేరుతుంది. అలానే నంబరు. 07781 విజయవాడ - మాచర్ల ప్యాసింజర్ ప్రస్తుతం సాయంత్రం 5.45కి గుంటూరులో బయలుదేరి రాత్రి 9.35కి మాచర్లకు చేరుకొంటున్నది. ఈ రైలుకి మాచర్ల - గుంటూరు, ఫలక్‌నుమా, పల్నాడు, సిల్చార్, విశాఖ, చెన్నై, ఇంటర్‌సిటీ రైళ్ల క్రాసింగ్ ఉన్న కారణంగా దీని ప్రయాణ సమయాన్ని 35 నిమిషాలకు పెంచారు. ఈ కారణంగా ఈ రైలు కొత్త సంవత్సరం ప్రారంభ తేదీ నుంచి రాత్రి 10.10కి మాచర్ల చేరుకొంటుంది.

ఇదేవిధంగా నంబరు. 07782 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైలు నిత్యం వేకువజామున 5.30 గంటలకు బయలుదేరి ఉదయం 9 గంటలకు గుంటూరు చేరుతున్నది. ఈ రైలుకు ఫలక్‌నుమా, పల్నాడు, శబరి, మాచర్ల ప్యాసింజర్ రైళ్ల క్రాసింగ్ ఉన్నది. అయితే ఈ రైలు ప్రయాణ సమయాన్ని కొత్త సంవత్సరంలో పెంచకుండా ఇంకా 30 నిమిషాలు తగ్గించారు. మరోవైపు నంబరు. 07780 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైలు ప్రస్తుతం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి రాత్రి 7.45కి గుంటూరుకు చేరుకొంటుంది. ఈ రైలుకు గుంటూరు - నడికుడి సెక్షన్‌లో ఇంటర్‌సిటీ, మాచర్ల ప్యాసింజర్ రైళ్ల క్రాసింగ్ ఉన్నది. దీని వలన కొన్ని సందర్భాల్లో వందేభారత్ రైలు కూడా క్రాసింగ్ అవుతున్నది. అలానే వెనకగా వచ్చే ఫలక్‌నుమా, పల్నాడుకు కూడా ప్రిసిడెన్స్ పడుతున్నది. ఈ నేపథ్యంలో రైలు ప్రయాణ సమయాన్ని 15 నిమిషాలు పెంచి రాత్రి 8 గంటలకు వచ్చేలా టైంటేబుల్‌ని జనవరి 1వ తేదీ నుంచి సవరించారు.

ఫెడరేషన్ కప్‌లో మహిళా లిఫ్టర్లకు పతకాలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఫెడరేషన్ కప్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన మహిళా లిఫ్టర్లు పతకాలు సాధించారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కర్, షేక్ సంధాని మంగళవారం తెలిపారు. షేక్ సాదియా అల్‌మాస్ జూనియర్స్ స్క్వాట్ 57 కిలోల విభాగంలో 200 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, బెంచిప్రెస్‌లో 97.5 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, డెడ్‌లిఫ్ట్‌లో 185 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, మొత్తంగా 482.5 కిలోల బరువును ఎత్తి జూనియర్ నేషనల్ రికార్డు సాధించడంతోపాటు బెస్ట్ లిఫ్టర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బొల్లినేని చంద్రిక సీనియర్స్ 84 కిలోలు పైబడిన విభాగంలో స్క్వాట్‌లో 240 కిలోల బరువును ఎత్తి రజతం, బెంచిప్రెస్‌లో వంద కిలోలతో రజతం, డెడ్‌లిఫ్ట్‌లో 210 కిలోలతో స్వర్ణం, మొత్తంగా 550 కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకం సాధించింది. షేక్ షబీనా 84 కిలోలు పైబడిన విభాగంలో డెడ్‌లిఫ్ట్‌లో తృతీయ స్థానం, ఓవరాల్‌గా ఐదవ స్థానంలో నిలిచింది. పతకాలు సాధించిన లిఫ్టర్లను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నకల సూర్యనారాయణ అభినందించారు.


పతకాలు సాధించిన షబీనా, చంద్రిక, సాదియా

ప్రజలకు సౌకర్యంగా అండర్ పాస్‌లు

- ప్రజాధనం, సమయం వృథా చేసిన వ్యక్తి జగన్
- విజన్ ఉన్న నేత చంద్రబాబునాయుడు
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు పరిశీలన

తుళ్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సౌకర్యంగా ఉండేలా బైపాస్ రోడ్డు నిర్మాణంలో అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజధాని ప్రాంతం మీదుగా వెళ్తున్న విజయవాడ వెస్ట్ బైపాస్ పనులను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం ప్రతి రెండు కిలో మీటర్లకు అండర్ పాస్ మార్గాలను వేయాల్సి ఉండగా, రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రజల సౌకర్యం కోసం ప్రతి కిలోమీటర్‌కు ఒక అండర్ పాస్ ఉండేలా 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం సంపూర్ణ అనుమతులు ఇచ్చింద న్నారు. అంతేకాకుండా అంతర్గత రహదారులకు కనెక్టివిటీ బాగుండే విధంగా ప్రతి కిలోమీటర్‌కు ఒక అండర్ పాస్ ఉండాలని నిర్ణయించిందన్నారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయా అనుమతులను తుంగలో తొక్కి, పాత నిబంధనను కొనసాగించమని అధికారులను ఆదేశించారని తెలిపారు. పరిపాలనపై అవగాహన, దూరదృష్టి లేని వ్యక్తి జగన్మోహనరెడ్డి అన్నారు. బైపాస్ పనులకు సంబంధించిన ప్రజాధనం రూ. 400 కోట్లు, విలువైన సమయం వృథా అయ్యిందనటానికి నిదర్శనం ఆయన తీసుకున్న నిర్ణయాలేనన్నారు. వాస్తవానికి ఏప్రిల్‌కి బైపాస్ పనులు పూర్తి కావాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వ నిర్ణయాల వలన మరో ఏడాదిన్న వరకు ఆలస్యం అవుతుందన్నారు. ఏదైన చిన్న చిన్న సమస్యలు ఉన్నా సరే అధికారులతో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామ న్నారు. చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఏ ఒక్క రైతుకి, ప్రజలకు అన్యాయం జరగే సమస్య లేదన్నారు. ప్రజల సౌకర్యార్థం అధికారులు ఇచ్చే ప్రపోజల్స్ ప్రకారం 10 అండర్ పాస్‌లు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జీ.ఎస్.సాయి ప్రవీణ్ చంద్, ఎన్‌హెచ్‌పీడీ పార్వతీశం, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈ ప్రభాకర్, టీడీపీ నేతలు పట్టాబిరామయ్య, బెల్లంకొండ నరసింహరావు, జమ్ముల అనిల్, నవయుగ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్, మేనేజర్ రామకృష్ణ, అదాని సంస్థ తరపున పీడీ శ్రీరామ్ మూర్తి, బసవేశ్వరరావు పాల్గొన్నారు.


విజయవాడ వెస్ట్ బైపాస్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్


కర్ణాటక-ఉత్తరాఖండ్ మ్యాచ్ డ్రా


సుకృత్ (74 పరుగులు)


ధ్రువ్ (54 పరుగులు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ అండర్-16 ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో కర్ణాటక, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 146.1 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 445 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఓవర్‌నైట్ స్కోరు 112/3 పరుగులతో మూడో రోజు బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు 66 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఆఖరి రోజు మధ్యాహ్నం నుంచి వర్షం కురవడంతో అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. కర్ణాటక బ్యాటర్లు జే.సుకృత్ 74 (నాటౌట్), ధృవ్ కృష్ణన్ 54 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ బౌలర్ ప్రియాన్షు సింగ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

ఉపాధి కూలీలకు తీపి కబురు



- ఇకపై కనీస వేతనం రూ.300
- నిరంతరం తనిఖీలు, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కూలీలకు ఎన్డీయే ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఇకపై ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయటంతో పాటు కూలీల కనీస వేనాన్ని రూ 263 నుంచి రూ.300కి పెంచి ఇవ్వటానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగం బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేయటంతో పాటు, పని వేళ్లల్లో మార్పులు చేసి కూలీలకు గిట్టుబాటు వేతనం అందించేందుకు పర్యవేక్షణ చేయనుంది. ఈ విభాగానికి డ్వామాలో కీలకంగా జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది.

సత్తెనపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కూలీలు ప్రస్తుతం నాలుగు గంటలు పాటు పని చేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్టర్లు తనిఖీ చేయాలి. ఈ తరహా చర్యలతో కూలీలకు సగటున మూడు వందల రూపాయల వేతనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం అందాలంటే ఏయే పనులు ఎంత సమయంలో చేయాల్సి ఉంటుందనే అంశాల పై జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తుంది.

బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట..

ఉపాధి పనుల్లో ఇప్పటికే బోగస్ మస్టర్ల బోగోతం నడుస్తుంది. కూలీలు పనికి రాక పోయినా హాజరైనట్టు కొందరు సిబ్బంది మస్టర్లు వేసి వేతనాలు స్వాహా చేస్తున్నారు. వేతన దినాలు దుర్వినియోగం కావటంతో పాటు పనులకు హాజరైన కూలీలకు పూర్తిగా వేతనం అందటం లేదు. అక్రమాలు అరికట్టడానికి జిల్లా స్థాయిలో పర్యవేక్షించే జిల్లా విజి లెన్స్ అధికారి సమన్వయంచేస్తారు.


ఉపాధి హామి పనులు చేస్తున్న కూలీలు



నిబంధనలు ఇవే...

ఉపాధి కూలీలకు కనీస వేతనం పెరగటానికి ప్రభుత్వం నిబంధనలు విధించింది. నిధానంగా పనుల గుర్తింపు పని ప్రదేశానికి అనుగుణంగా చేపట్టాలి. ముందస్తుగా అంచనాలు తయారు చేయాలి. నేల స్వభావం, కూలీలు పని చేయటానికి అనువుగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకొని పనులు కల్పించాలి. పని వేళ్ళల్లో మార్పులు చేయాలి. సాంకేతిక సహాయకులు నిత్యం పర్యవేక్షించాలి. ఏపీడీ, ఏపీవో, ఎంపీడీవోలు మస్టర్లు తనిఖీ చేయాలి. కూలీలు చేసే పని వేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. వేతనాల రసీదులు కచ్చితంగా ఇవ్వాలి.

లక్ష్యానికి అనుగుణంగా పని వేళలు



జాబ్ కార్డు ఉన్న వారందరికీ దినసరి వేతనం రూ 300 అందేలా చూస్తాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి కూలీల పని వేళలు పెంచాలి. రోజుకు నాలుగు గంటలు పని చేసే కూలీలు ఐదు గంటల పాటు చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుంది. వేతన పెంపు పై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాల్లో 1,73,549 కూలీలు నమోదయ్యారు. 99,924 మంది ఉపాధి హామి పథకంలో పనులు చేస్తున్నారు. - నారాయణ, ఏపీడీ, సత్తెనపల్లి

245 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 24: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 245 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,000, గరిష్ఠ ధర రూ.11,000, మోడల్ ధర రూ.11,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,000, గరిష్ఠ ధర రూ.11,400, మోడల్ ధర రూ.11,000 పలికాయి.

సీపీఐ నేతకు పరామర్శ

తాడేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం, పెనుమాక గ్రామంలో సీపీఐ సీనియర్ నేత షేక్ సాబ్జాన్ కొంత కాలంగా అనారోగ్యంతో ఇంటి వద్ద ఉంటున్నారు. విషయం తెలుసుకున్న సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీనియర్ నేతలు గుంటక సాంబిరెడ్డి, బండ్లమూడి రాంబాబులు మంగళ వారం సాబ్జాన్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సీపీఎం నాయకులు ఎర్రపీరును పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు హనాక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే

రెవెన్యూ గ్రామసభలు

కాకుమాను, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ గ్రామసభల ముఖ్య ఉద్దేశ్యమని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. మండల పరిధిలోని కొమ్మూరులో మంగళవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. భూ కొలతల కోసం 9 అర్జీలు, భూమి రికార్డుల ఆన్‌లైన్ కోసం 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

రేపు సీపీఐ శత వార్షికోత్సవం

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేద, బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు చేస్తున్న సీపీఐ ఆవిర్భవించి ఈ నెల 26కు వందేళ్లు పూర్తిచేసుకుంటుందని నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తెలిపారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సీపీఐ ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలను సాధించిందన్నారు. ఈ నెల 26న వాడవాడలా అరుణ పతాకాలను ఎగురవేసి శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నేతలు అన్నవరపు ప్రభాకర్‌రావు, కంచర్ల కాశయ్య జాలాది జాన్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరుబాట

తాడికొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమాన్ని ఈ నెల 27న చేపట్టనున్నట్లు తాడికొండ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు పేర్కొన్నారు. గుంటూరులోని వైసీపీ తాడికొండ నియోజక వర్గ కార్యాలయంలో మంగళవారం 'పోరు

క్రిస్మస్ సందడి..

తాడికొండ డిసెంబరు 24: తాడికొండ మండలంలోని చర్చిలు క్రిస్మస్ పండుగకు ముస్తాబైనాయి. గ్రామాల్లో క్రిస్మస్ సందడి వాతావరణం నెలకొన్నది. క్రైస్తవ దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన కూడలల్లో విద్యుత్ స్టార్లను ఏర్పాటు చేశారు. క్రైస్తవుల ఇళ్లపై కూడా రంగురంగుల స్టార్లను ఉంచారు. గ్రామాల్లో సోమవారం నుంచే పండుగా వాతావరణం కన్పిస్తుంది. పొన్నెకల్లు, నిడుముక్కల, మోతడక, కంతేరు, తాడికొండ, గరికపాడు, పాములపాడు, దామరపల్లి, రావెల, ఫణిదరం, బండారుపల్లి తదితర గ్రామాలలో చర్చిలలో, మందిరాల్లో ప్రత్యేక పార్థలను, ఏసుక్రీస్తు నాటికలు, డ్రామాలను నిర్వహించుతున్నారు. అర్ధరాత్రి పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

జిల్లా స్థాయి పోటీలలో

జడ్పీస్కూల్ విద్యార్థిని ప్రతిభ

గుంటూరు(విద్య),డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో నులకపేట జడ్పీ స్కూల్ విద్యార్థిని బి.మేఘన జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు షేక్ షాహిద్‌ఆలీ వెల్లడించారు. కలెక్టరేట్లో విజేతలకు రూ.1500 నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, మెమోంటోను జాయింట్ కలెక్టర్ రంజిత్ భార్గవ్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి సివి రేణుక విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ విద్యా శాఖ అధికారి జి.శాంతకుమారి, గుంటూరు రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఉర్దూ) ఎం.డి ఖాసిం, మండల విద్యాశాఖ అధికారి డి.నాగేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వనజ కుమారి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ టీమ్‌కు

విజ్ఞాన్ నిరులా విద్యార్థిని..

గుంటూరు(విద్య), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జెఎన్‌టియూ, కాకినాడ సౌత్ జోన్ వాలీబాల్ టీంకు విజ్ఞాన్ నిరూల విద్యార్థిని ఎంపిక కావడంతోపాటు, పోటీలలో కళాశాల టీం తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక మంగళవారం తెలిపారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్య అభ్యసిస్తున్న నెక్కల మాలతి సౌత్ జోన్ వాలీబాల్ టీంకు ఎంపికైనట్లు చెప్పారు. మాలతికి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, అధ్యాపకులు డాక్టర్ జి. సంధ్య, ఫిజికల్ డైరెక్టర్ కిషోర్ కుమార్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. హరీష్ అభినందనలు తెలిపారు.

27 నుంచి నాటక ప్రదర్శనలు

గుంటూరు (తూర్పు) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 27, 28 తేదీల్లో పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

● ముస్తాబైన చర్చిలు



క్రిస్మస్ తాత వేషధారణల్లో చిన్నారులు

పెదనందిపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు చర్చిలు రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం క్రిస్మస్‌పండగ నేపథ్యంలో వేడుకలు నిర్వహించేందుకు, ప్రత్యేక ప్రార్ధనలు చేసేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రం పెదనందిపాడులో వివిధ వ్యాపార సముదాయాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

క్రీస్తు ప్రజలకు ప్రేమను పంచి సత్యాన్ని బోధించారని మాజీ ఎంపీపీ, పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ముద్దన నగరాజకుమారి అన్నారు. స్థానిక లయన్స్‌మాంటిస్సోరీ సీబీఎస్ పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాలక వర్గ సభ్యులు సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు దాసరి శేషగిరిరావు, అధ్యక్షుడు అరవపల్లి కృష్ణ, సభ్యులు ముద్దన రాఘవయ్య, దాసరి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కిరణ్‌జోష్, విశ్రాంత హెచ్‌ఎం రమణేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను, (ఆంధ్రజ్యోతి): పాపాలను నిర్మూలించడంకోసం భూమి పైకి వచ్చిన భగవంతుడు ఏసుక్రీస్తు అని జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్‌బేగం అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా క్రిస్మస్ కేక్‌ను ఆయన కట్ చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మంగళగిరిలో క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున్న పోతినేని శ్రీనివాసరావు, నాని తదితరులు



లయన్స్‌మాంటిస్సోరీ సీబీఎస్‌లో క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న పాలకవర్గ సభ్యులు

మంగళగిరి, (ఆంధ్రజ్యోతి): కొమ్మారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళ వారం చర్మకారులు, కాటికాపరులకు క్రిస్మస్ కానుకలు పంపిణీచేశారు. టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా 20 మందికి దుస్తులు, నిత్యావసరాలు, కూరగాయలు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో కొమ్మారెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కొమ్మారెడ్డి సుబ్రహ్మణ్యం(నాని), న్యాయవాది గోవర్ధనరావు, కొమ్మారెడ్డి శ్రీకాంత్, టీడీపీ నేతలు మహమ్మద్ ఇబ్రహీం, వెలగపాటి విలియం, కోలాశ్రీను, గాజుల క్రాంతికుమార్, కోట కరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాద్' పథకంతో మెరుగైన వసతులు

● వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి సమీక్ష

● 27 లోగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం తీర్థయాత్ర పునరుజ్జీవం, ఆధ్యాత్మిక వారసత్వం పెంపుదల డ్రైవ్ (ప్రసాద్) నిధులను వినియోగించుకోవాలని, మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. స్థానిక ఎంటీఎంసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవస్థానం ప్రాశస్త్యానికి ఎలాంటి విఘాతం కలుగకుండా భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పించాలని, ఇందుకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఈ పథకం నిధులను వినియోగించేందుకు శుక్రవారం లోపు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మరింత మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధి, స్థానికులకు ఉపాధి పెరిగే అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సదరు ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వానికి పంపించి, అనుమతి పొందడంతోపాటు నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. సమావేశంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, దేవాదాయశాఖ అదనపు కమిషనర్ రామమోహనరావు, సహాయ కమిషనర్ ఎ.రామకోటిరెడ్డి, జిల్లా అటవీ శాఖాధికారిణి హిమ శైలజ, పర్యాటక శాఖాధికారిణి అద్దంకి శ్రీరమ్య పాల్గొన్నారు.



అధికారులతో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



ప్రత్యేక పూజలో పాల్గొన్న కాటూరి రాము తదితరులు

శబరిమల దేవస్థానం బోర్డుకు

విజయ పచ్చళ్ల అందజేత

తాడేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన విజయ పికిల్స్ అధినేత కాటూరి రాము శబరిమల అయ్యప్పస్వామి దేవస్థానానికి రూ. 9.5 లక్షల విలువ చేసే 18 రకాల రెండున్నర టన్నుల అన్నిరకాల పచ్చళ్లను సోమవారం అందజేశారు. కొంతకాలంగా ప్రముఖ దేవాలయాలకు నిత్య అన్నదానవితరణ కార్యక్రమాలకు విజయ పచ్చళ్ళు, పొడులను అందిస్తున్నారు. విజయ పికిల్స్ అధినేత కాటూరి రాము సోమవారం దేవస్థానం బోర్డు అధికారులైన ఈవో మురారికి ఈ విరాళాన్ని అందించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రామును ఆలయ అధికారులు సత్కరించి అభినందించారు. రాబోయే రోజుల్లోనూ ఇటువంటి కార్యక్రమాలుచేపడతామని రాము తెలిపారు.

26, 27 తేదీల్లో రైతుల బాండ్ల

రెండో విడత తనిఖీలు

దుగ్గిరాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం దుగ్గిరాలలో గత జనవరి 19న స్థానిక శుభంకోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు సంబంధించిన బాండ్‌లను బీమాసంస్థ బృందం రెండో విడత తనిఖీలు ఈనెల 26, 27తేదీల్లో నిర్వహించనున్నారు. నష్టపోయిన రైతులు 400 మందికి పైగా ఉండగా పసుపునిల్వలపై కోట్లాదిరూపాయలు పరిహారం అందించే క్రమంలో భాగంగా ఇండియా ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిదులు, 200 మంది రైతులకు సంబంధించి బాండ్లను తొలివిడత ఈనెల 16,17తేదీల్లో బాండ్లను ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులకు చూపి తనిఖీలు చేయించుకున్నారు. మిగిలిన రైతుల వద్ద నున్న తక్షణమే తమ బాండ్లను పసుపుయార్డుకు తీసుకువచ్చి, శుక్రవారం, శనివారాల్లో తనిఖీ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పశ్చిమ డెల్టా కాల్వకు

1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 150 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 60 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 76 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1160 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



నీటి మోటార్లు దొంగిలించుకు వెళ్లిన ప్రదేశం చిత్రం

మోటార్లు, కాపర్‌వైర్లు చోరీ

● నిలిచిపోనున్న తాగు నీరు సరఫరా

పెదనందిపాడు, డిసెంబరు, 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వరగానిలో కొల్లా వారి చెరువు వద్ద సీపీఎస్‌డబ్ల్యూఎస్ స్కీంకు సంబంధించిన రెండు నీటి మోటార్లు, విద్యుత్ కాపర్ వైర్లను గుర్తుతెలియని దుండుగులు సోమవారం రాత్రి అపహరించుకెళ్లారు. స్థానికుల కథనం మేరకు వాచమెన్ ఇంటికి భోజనానికి వెళ్ళిన సమయంలో గుర్తుతెలియని దుండుగులు అక్కడికి వచ్చి షెడ్డులో ఉన్న రెండు మోటార్లను, తాగునీటిని సరఫరా చేసే ఎనిమిది మోటార్లకు ఉన్న కాపర్ వైర్ బాక్సును తీసుకుని వెళ్ళారు. ఆ సమయంలో వాచ్‌మెన్ అక్కడికి వచ్చి కేకలు వేయడంతో వారు పరారైనట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా పెదనందిపాడు, వరగాని, నాగులపాడులకు తాగునీరు అందుతుంది. ఈ చోరీతో మూడు గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా చేయాలని కోరుతున్నారు. చోరీ ఘటపసా సంబంధిత అధికారులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడం కొసమెరుపు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

21వ రోజుకు కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఏసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళ వారం నాటికి 21వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీసీ యాజమాన్యం దిగి రావాలని, తన తప్పును ఇప్పటికైనా సరిదిద్దుకోవాలని, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తే వందలాది కుటుంబాలు రుణపడి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, యెహోషువ, దుర్గా భవాని, నాగేశ్వరరావు, రమణ, లక్ష్మీ, సాంబయ్య, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.



అర్జీ అందిస్తున్న సీపీఎం నాయకులు

స్థానికులకు పట్టాలు ఇవ్వాలి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్థలాలు, కొండపోరంబోకు స్థలాల్లో నివసించే వారికి అక్కడే పట్టాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం 6, 14, 15, 16 సచివాలయాల్లో తాడేపల్లి సీపీఎం పట్టణ నాయకులు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బూరగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకర్, బాబూరావు, దర్శనపు విజయ్, ఫిరోజ్, దేవకుమార్ పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో

రెండో విడత బాండ్ల తనిఖీలు

దుగ్గిరాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం దుగ్గిరాలలో గత జనవరి 19న స్థానిక శుభం కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో రైతులు నష్టపోయిన విషయం విదితమే. నష్టపోయిన రైతులకు సంబంధించిన బాండ్‌లను ఈనెల 26, 27 తేదీల్లో బీమా సంస్థ బృందం రెండో విడత తనిఖీలు చేపట్టనుంది. నష్టపోయిన రైతులు 400 మందికి పైగా ఉండగా పసుపు నిల్వలపై కోట్లాది రూపాయల పరిహారం అందించే క్రమంలో భాగంగా ఇండియా ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిదులు, 200 మంది రైతులకు సంబంధించిన బాండ్ల తొలివిడత తనిఖీలు ఈ నెల 16,17 తేదీల్లో జరిగాయి. మిగిలిన రైతులు తమ వద్ద ఉన్న బాండ్లను పసుపు యార్డుకు తీసుకువచ్చి తనిఖీ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెరియార్‌కి నివాళి

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పాతగుంటూరులోని కార్యాలయంలో మంగళవారం పెరియార్ రామస్వామి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్ రజకజన సేవాసంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీని వాసరావు, వటికూటి సాంబయ్య జీఆర్ భగత్‌సింగ్, పీ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనైక్యతే వెనుకబాటుకి కారణం

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు వెల్లడి

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీల మధ్య ఐక్యత లేకపోవడమే ఆయా వర్గాల వెనుకబాటుకు కారణమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అభిప్రాయపడ్డారు. స్థానిక బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో చోటు చేసుకున్న పరిణామాలు దురదృష్టకరమని అన్నారు. ఈ ఘటన తర్వాత జరిగిన పరిణామాలు, సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్న ప్రచారాలు బీసీల మధ్య మరింత అగాథాన్ని పెంచే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. లచ్చన్న విగ్రహావిష్కరణ కమిటీలో కొంత మంది తమ రాజకీయ ఎదుగుదల కోసం పలు రాజకీయపార్టీల పెద్దలను పిలిచి ఉండవచ్చునని, నిర్వాహకులు ఎవరనేది తెలుసుకోకుండా ఈ కార్యక్రమానికి హాజరు కావడం రాజకీయ నాయకుల తప్పిందం తప్ప నిర్వాహకులైన గౌడ పెద్దలది కాదని అన్నారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని కుల సంఘాలు, బీసీ సంఘాలు నిర్వహించే కార్యక్రమాలకు ఏ రాజకీయ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు రాకపోవడమే మేలని సూచించారు. నూజివీడులో జరిగిన ఘటన మరెక్కడా పునరావృతం కాకుండా ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా వున్న సర్దార్ గౌతులచ్చన్న విగ్రహాలన్నింటినీ పవిత్ర నదీజలాలతో అభిషేకించాలని శంకరరావు పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, అధికార ప్రతినిధి బాదుగునల శ్రీనివాస్, హనుమంతరావు, దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు



అనుగ్రహభాషణం చేస్తున్న చినజీయర్ స్వామి

ధనుర్మాస ఉత్సవాల్లో తొమ్మిదో పాశురం

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యదుకుల తిలక రత్న ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని ఆత్మకూరులో ఉన్న బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిదవ రోజైన మంగళవారం త్రిదండి చినజీయర్ స్వామి భక్తులకు తొమ్మిదో పాశురాన్ని వివరించారు. గుంటూరు, విజయవాడ, మంగళగిరి ప్రాంతాల భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. భజన కీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టు కున్నాయి. కార్యక్రమంలో వైటీఆర్ ట్రస్టు చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, వేద పండి తులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో అగ్నిప్రమాదం

● రూ.3లక్షల ఆస్థి నష్టం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బోసు బొమ్మ సెంటర్ సమీపంలోని సీపీఎం పార్టీ కార్యాలయం వెనుక డాబా ఇంటిలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిడ్జ్‌లో మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగిందని ఇంటి యజమాని సయ్యద్ మొహమ్మద్ తెలిపారు. సమాచారం తెలుసుకున్న మంగళగిరి ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఫ్రిడ్జ్‌తోపాటు టీవీ, ఏసీ, సీలింగ్ ఫర్నిచర్ మంటల్లో కాలిపోవడంతో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు సయ్యద్ తెలిపారు. కాగా అగ్నిప్రమాదం జరిగిన ఇంటిని, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు సందర్శించి అధికారులతో మాట్లాడారు. బాధితునికి న్యాయం చేయాలని కోరారు.



మంటల్లో పూర్తిగా కాలిపోయిన ఇంటిలోని సామగ్రి

భగవత్ తత్త్వ అనుభూతి ధ్యానంతో సాధ్యం

దుగ్గిరాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : భగవతత్వాన్ని అనుభూతి చెందడం ధ్యానంతోనే సాధ్యమని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ సుంకర రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీసద్గురు శుభ వేదికలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత ధ్యానశిక్షణ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. రామకోటేశ్వరరావు మాట్లాడుతూ రామచంద్రమిషన్ సహకారంతో ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకూ ధ్యానం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేస్తారన్నారు. అనంతరం జంపాల కుసుమకుమారి మాట్లాడుతూ, శిక్షణ అనంతరం శుభవేదికలో వారంలో మూడు రోజుల పాటు దీనిని కొనసాగిస్తామన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు పసుపులేటి గణేష్, ధ్యానశిక్షకుడు కుప్పాల శ్రీనివాసరావు, ఆర్గనైజర్ కే నాగేశ్వరరావు, చింతమనేని విజయబాబు, గద్దె కుమారి, కొలకలూరు ఆశ్రమ ప్రతినిధి పి. నారాయణమూర్తి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

● ఎన్‌సీఆర్‌డీ కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

● విద్యా సంస్థలు, సంక్షేమ శాఖ వసతి గృహాలలో పర్యవేక్షణ

● సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశం

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలు అరికట్టేందుకు ఎన్‌సీఆర్‌డీ కమిటీలోని అధికారులందరూ నిర్దేశిత మార్గ దర్శకాల ప్రకారం సమన్వయంతో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగ లక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా స్థాయి ఎన్‌సీఆర్‌డీ కమిటీ(డగ్స్, మాదక ద్రవ్యాలు అరికట్టడం) సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంస్థలు, వాటి పరిసరాల్లో మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాల ను అరికట్టడం, సంక్షేమ శాఖ వసతి గృహాలలో పర్యవేక్షణ కోసం సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లోకి బయట వ్యక్తులు రాకుండా, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ మాదక ద్రవ్యాలు అరికట్టేం దుకు తీసుకుంటున్న చర్యలు, నమోదు చేసిన కేసులు తదితర అంశాలను పవర్ పాయిం ట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలను క్రైం హాట్ స్పాట్‌గా గుర్తించి పోలీసులతో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, డీఈవో రేణుక, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ మహబూబ్ షరీఫ్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సం చాలకులు మధుసూదనరావు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, డ్రగ్ కంట్రోల్ ఏడీ లక్ష్మణ్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దుర్గాబాయి, జీఆర్పీ డీఎస్పీలు జయరాం, మల్లికార్జునరావు, అజీజ్, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, పోలీస్, రైల్వే తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

విశ్వానికి వెలుగులు పంచిన ఏసుక్రీస్తు: ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వానికి వెలుగులు పంచిన కరుణామయుడు ఏసుక్రీస్తు అని, ఆయన జన్మదినాన్ని ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు, జిల్లాలోని పాడి రైతులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పలు ప్రభుత్వ శాఖల అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు

తెనాలి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు పురాతన క్రీస్తు దేవాలయాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు అయ్యాయి. పండుగను ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవులు సన్నద్ధమయ్యారు. ప్రధాన చర్చిలన్నింటిని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో కళకళలాడుతున్నాయి. బోసురోడ్డులోని టౌన్‌చర్చిని విస్తరించి అభివృద్ధి పనులు చేపట్టడంతో కొత్త శోభ సంతరించుకుంది. ఐతానగర్‌లోని క్రీస్తు కృపాలయం. చెంచుపేటలో నిత్య సహాయ మాత మందిరం, ఐతానగర్‌లో సాల్వేషన్ ఆర్మీ చర్చి, బెరాకా మందిరం, చినరావూరులో క్రీస్తు దేవాలయం వద్ద ప్రార్థలకు ఏర్పాట్లు చేశారు. ఆయా చర్చిలలో నిర్వాహక కమిటీలు, పాస్టర్లు, సంఘ పెద్దలు, క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలకు ప్రత్యేక ప్రార్థనలు జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వ పండుగ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పొన్నూరు, చేబ్రోలు మండలాలోని చర్చిలు ప్రత్యేక వేడుకలకు ముస్తాబు అయ్యాయి. పొన్నూరు పట్టణంలోని పాతపొన్నూరులో వందేళ్ల చరిత్ర కలిగిన క్రీస్తు శతవార్షిక లూథరన్ దేవాలయంను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. క్రీస్తు జననాన్ని స్మరించుకునేలా చర్చి వద్ద స్టార్ ఏర్పాటు చేయటంతోపాటు, చర్చిని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పట్టణంలోని జీబీసీ రోడ్డులో ఉన్న క్రీస్తు ఉథాన దేవాలయం, సాల్వేషన్ ఆర్మీ చర్చి, నిడుబ్రోలు లూథరన్ దేవాలయంతోపాటు పలు చర్చిలు, చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెంలోని యూదు దేవాలయం తదితర చర్చిలు క్రిస్మస్ వేడుకలను సిద్ధమయ్యాయి. చర్చిలను వేడుకలకు సిద్ధం చేయటంతోపాటు విద్యుత్ దీపాలతో అలంకరించి ఆకర్షణీయంగా స్టార్లను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు జరిగాయి.





విద్యుత్ కాంతులలో చెంచుపేట నిత్య సహాయమాత ఆలయం, బోసురోడ్డులోని టౌన్‌చర్చి



అంగలకుదురులో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న రెడ్‌క్రాస్ కార్యదర్శి భానుమతి, డాక్టర్ పావని ప్రియాంక

ఘనంగా సెమీ క్రిస్మస్

తెనాలి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్ రక్షణ సైన్యం చర్చిలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్నల్ థామస్, సీయోనుకుమారి, మేజర్ నాగరాజు, రత్నసుందరి క్రీస్తు సందేశం ఇచ్చారు. కేక్ కట్ చేసి క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. అంగలకుదురులో ముక్తి ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో రెడ్‌క్రాస్ కార్యదర్శి ముమ్మనేని భానుమతి, డాక్టర్ పావని ప్రియాంక కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అందజేశారు. పలువురు గాయకులు క్రిస్మస్ గీతాలు ఆలపించారు. రవీంద్రబాబు, అపర్ణ, జయపాల్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శలపాడులో బహిరంగంగా మద్యపానం

- భయాందోళనలో మహిళలు, విద్యార్థులు
- గాంధీసెంటర్లో మందుబాబుల ఇష్టారాజ్యం
- సమస్యను పరిష్కరించాలని పలువురి విజ్ఞప్తి

చేబ్రోలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శలపాడులో మందుబాబుల ఆగడాలు రోజురోజుకు పెరుగుతుండటంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగురోడ్ల కూడలి అయిన మహాత్మాగాంధీ సెంటర్లో ఆయన విగ్రహంను ఆనుకుని గ్రామస్థులు న్యూస్‌పేపర్లు, బస్సులో వెళ్లేందుకు విద్యార్థినీ, విద్యార్థులు, స్కూల్ చిన్నారులు కూర్చునేందుకు పంచాయతీ బల్లలను ఏర్పాటుచేసింది. అయితే గ్రామంలోని కొందరు మద్యం సేవించే వారు ఆ బల్లలపై కూర్చొని పగలు రాత్రి తేడాలేకుండా బహిరంగంగానే మద్యం సేవిస్తూ ఘర్షణలకు దిగుతుండటంతో ఆ ప్రాంతంలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతలు పర్యవేక్షించే సచివాలయ పోలీసులు సైతం ఈ తతంగాన్ని చూసీచూడనట్లు వ్యవహరించడంతో మందుబాబులు రోడ్లపై వెళ్లేవారిపై ఎటువంటి దాడులకు దిగుతారోనని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్స్ కాలేజీల నుంచి వచ్చే విద్యార్థులు సైతం మద్యం సేవించే వారిని చూసి పెడదారిపట్టే అవకాశం ఉందని పలువురు తల్లిదండ్రులు ఆందోళనకు గురౌతున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో నెలకొన్న మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్టవేసి గ్రామస్థులకు భరోసాగా నిలవాలని పలువురు కోరుతున్నారు.



గ్రామ సెంటర్‌లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబులు

రెవెన్యూ సదస్సుకు 59 అర్జీలు

పొన్నూరు టౌన్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు 59 అర్జీలు దాఖలైనట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. మంగళవారం పాత పొన్నూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో పట్టణవాసులు అర్జీలు దాఖలలు చేశారు. పట్టణంలోని సుబ్బరాయ థియేటర్ రోడ్లో సర్వే నెంబర్ 407, 409 నంబర్లలో ఉన్న ఇల్లు, దుకాణాలు 22ఏ నిషేధిత జాబితాలో చేర్చినందున తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు నిషేధిత జాబితా నుంచి తమ సొంత ఇంటి స్థలాలు దుకాణాలను తొలగించాలని లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. అలాగే మ్యుటేషన్ కోసం 1 దరఖాస్తు, కుల ధ్రువీకరణకు 1, దరఖాస్తులు 5, 22ఎ దరఖాస్తులు, 52 దాఖలయ్యాయి. రెవెన్యూ సదస్సులో అధికారులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.



నూతన వస్త్రాలు అందుకున్న కార్మికులతో సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి తదితరులు

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

- అంగలకుదురు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్

తెనాలి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతూ గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం శ్రమించే పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని అంగలకుదురు గ్రామ సర్పంచ్ ఊసరవు రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కనగాల నాగభూణం చెప్పారు. మంగవారం అంగలకుదురు గ్రామ పంచాయతీలోని సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, స్వీట్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళారంగానికి శ్రీరామమూర్తి సేవలు నిరుపమానం

తెనాలి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కళారంగానికి రచయిత, దర్శకుడు రావినూతల శ్రీరామమూర్తి సేవలు నిరుపమానమని పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి చెప్పారు. కవిరాజా పార్కులో మంగళవారం శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సాహిత్యం, సంగీతం, నాటకం, నాటికలు, జానపద కళారూపాలలో శ్రీరామమూర్తి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. నంది నాటకోత్సవాలలో తెనాలిని ప్రథమ నంది బహుమతిని సాధించిన ఘనత ఆయనదేనన్నారు. షేక్ అస్మాతున్నీసా, బెల్లంకొండ వెంకట్, అలపర్తి వెంకటేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్, అపర్ణ, రఘునాథరావు, దేవిశెట్టి కృష్ణారావు, బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి: ములకా

తెనాలి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కంచెర్లపాలెంలో నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించి ఇంటింటికి తిరుగుతూ వారికి వచ్చిన విద్యుత్ బిల్లులను పరిశీలించి పెరిగిన ధరలపై గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పేదలపై విద్యుత్ బిల్లుల భారం మోపడం సరికాదన్నారు. అదే విధంగా స్మార్ట్ మీటర్ల విధానాన్ని తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. విద్యుత్ బిల్లులను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చుక్కపల్లి ప్రభాకర్ రావు, భాస్కరరావు నరసయ్య, లక్ష్మీనారాయణ, దేవసహాయం, యలమంద, పాములు, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

27న జరిగే వైఎస్సార్ పోరుబాటను విజయవంతం చేయాలి: అన్నాబత్తుని

తెనాలి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న తలపెట్టిన వైఎస్సార్ పోరుబాట కార్యక్రమానికి నియోజకవర్గ పార్టీ శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ పార్టీ పోరుబాట పోస్టర్లను నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపెంచిన విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం ఉదయం 10గంటలకు పట్టణంలోని చెంచుపేట విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. నియోజవర్గంలో వైసీపీ శ్రేణులుందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు డాక్టర్ వుళ్ళక్కి

ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్యరంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన డాక్టర్ మేజర్ కాకుమాను వుళ్ళక్కి చిరస్మరణీయుడని పట్టణ ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె అనిల్ కుమార్ అన్నారు. బోసురోడ్డులోని ఐఎంఏ శాఖ కార్యాలయంలో మంగళవారం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె అనిల్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ మేజర్ కాకుమాను వుళ్ళక్కి 60వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో మొదటితరం వైద్యులలో డాక్టర్ వుళ్ళక్కి ముఖ్యలన్నారు. తన స్థిరాస్తిని వైద్యరంగం అభివృద్ధి కోసం ఐఎంఏ శాఖకు ఇచ్చిన మహాదాత అని, తన పార్థివ దేహాన్ని కూడా వైద్య కళాశాల అనాటమీ ల్యాబ్‌కు ఇచ్చారన్నారు. ఆయన పేద ప్రజలకు చేసిన వైద్య సేవలను పలువురు వైద్యులు కొనియాడారు. అనంతరం 100మంది పేదలకు పండ్లను, అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ శాఖ కార్యదర్శి డాక్టర్ జి.మధుప్రభాకర్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ పావని ప్రియాంక, కోశాధికారి డాక్టర్ కె శ్యాంప్రసాద్, వైద్యులు చందు సాంబశివుడు, వేమూరు శేషగిరిరావు, ఉమామహేశ్వరావు, గంటా నరసింహారావు, గుమ్మడి సాంబశివరావు, కోటి నాగయ్య, విశ్వమోహన్‌రావు, ఎంవీ సత్యనారాయణ, జి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ వుళ్ళక్కి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రియాంక తదితరులు

నారాకోడూరు విద్యార్థినులకు జిల్లా స్థాయి బహుమతులు

చేబ్రోలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులకు జిల్లాస్థాయి బహుమతులు వచ్చాయి. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆహార, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అంశంపై జిల్లాస్థాయి డిబేట్ పోటీలు గుంటూరులో జరిగాయి. ఈ పోటీలలో నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన ఎస్‌కే నజ్మాకు ద్వితీయ స్థానం సాధించింది. వ్యాస రచన పోటీలలో పఠాన్ షమీకి తృతీయ స్థానం సాధించింది. విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ రంజిత్ భార్గవ్ సర్టిఫికెట్లు మెమెంటోలు, రూ.2వేల నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, జిల్లా వినియోగదారుల కమిషన్ జడ్జి సునీత, వినియోగదారుల సంఘం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న జేసీ రంజిత్ భార్గవ్

ప్రభుత్వ భవనాల వద్ద పిచ్చి చెట్ల తొలగింపు

పొన్నూరు టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాల వద్ద ఉన్న పిచ్చి చెట్లు, చెత్త చెదారాల తొలగింపును పంచాయతీ అధికారులు మంగళవారం నిర్వహించారు. గ్రామంలో లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సచివాలయం సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్ల నిర్వహణ లోపంతో వినియోగం లేని కారణంగా నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారి శిథిల స్థితికి చేరకున్నాయి. ఈ ప్రభుత్వ భవనాలు వద్ద పిచ్చి చెట్లు మొలిచి చెత్త చెదారాలు పేరకుపోవడంతో ప్రజాధనం వృథాగా మారింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం మేరకు స్పందించిన మండల పరిషత్ అధికారులు మంగళవారం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వద్ద చెట్ల తొలగింపు, చెత్త నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. అలాగే సచివాయం వద్ద కూడా చెత్త తొలగించి భవనాలను వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వడ్డిముక్కలలో చెట్లను తొలగించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్

వృత్తి విద్యపై విద్యార్థుల క్షేత్రసందర్శన

తెనాలి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్ష నిర్వహిస్తున్న వృత్తి విద్యాకోర్సుల్లో భాగంగా ఇండస్ట్రియల్ విజిట్ లెర్నెట్ స్కిల్స్ వారి సహకారంతో హైస్కూల్ విద్యార్థులకు వృత్తి విద్యపై క్షేత్రసందర్శన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అంగలకుదురు స్కూల్ హెచ్‌ఎం ఎస్.అనురాధ ఆధ్వర్యంలో దాదాపుగా 150మంది విద్యార్థులు చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్శిటీలో వృత్తి శిక్షణ కోర్సులు, అక్కడ ఉన్న పరికరాలను పరిశీలించి వాటిని వినియోగించే విధానాన్ని తెలుసుకున్నారు. సీహెచ్ గోవర్ధన్‌రావు, ఎం.శివజగదీష్‌కుమార్‌లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు కె.సీతారామమూర్తి, ఎస్.కె. మాలి, కె.యోహన్, వి. విద్యాసాగర్, కె. శ్రీలత, వృత్తి విద్యాశిక్షకులు టి.వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

క్రైమ్ జోన్

కుళ్ళిన మృతదేహం లభ్యం

పొన్నూరు టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిడుబ్రోలు రైల్వే స్టేషన్ వద్ద పిచ్చి చెట్లలో కుళ్ళిన స్థితిలో మృతదేహాన్ని అర్బన్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ ఎస్ఐ ఎం రాజ్‌కుమార్ కథనం ప్రకారం రైల్వే స్టేషన్ మూడవ ప్లాట్‌ఫామ్ సమీపంలో మృతదేహం ఉందని సమాచారంతో సోదాలు నిర్వహించి, రైల్వే పోలీసుల సాయంతో మృతదేహాన్ని గుర్తించారు. పొన్నూరు పట్టణానికి చెందిన 17వ వార్డు నివాసి అబ్దుల్ నాయబ్‌రసూల్ (62)గా గుర్తించారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతదేహం లభించిన తీరు, ఆనవాళ్లు బట్టి నాయబ్ రసూల్ వారం క్రితమే ఆత్మహత్య చేసుకున్నటట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం వద్ద పురుగు మందు బాటిల్ లభ్యమైనట్లు సమాచారం.

అప్పు చెల్లింపులపై వివాదం.. ఘర్షణ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లింపుల విషయంలో ఇద్దరు స్నేహితుల మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం స్థానిక పినపాడుకు చెందిన సాయి, లెనిన్‌లు స్నేహితులు. సాయి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండగా, లెనిన్ తాపీమేస్త్రి. సాయి దగ్గర లెనిన్ కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకున్నాడు. తిరిగి అప్పు చెల్లించే విషయంలో వివాదం చోటుచేసుకుంది. దీంతో మంగళవారం లెనిన్‌పై సాయి కొడవలితో దాడిచేసి గాయపర్చాడు. గాయపడిన లెనిన్‌ను స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గృహ నిర్మాణాలపై ఎంపీడీవో సమీక్ష

కొల్లిపర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేలా అధికారులు తమవంతు కృషి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణాలపై అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గృహ నిర్మాణాలపై ప్రతి ఒక్క లబ్ధిదారునిడి అవగాహన కలిగించాలన్నారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకున్న వెంటనే నగదు బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగించు కోవాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, సినియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో పెరిగిన చలి

తెనాలి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం వర్షపు చినుకులు కురుస్తూనే ఉన్నాయి. చలి కాలంలో కురిసిన వర్షంతో ఏర్పడిన వాతావరణం కారణంగా చలి తీవ్రత పెరిగింది. చలికాలంలో వానలు కురుస్తుండటంపై ప్రజలు విస్తుబోతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా మొదలైన వర్షపు చినుకులతో అక్కడక్కడ మాగాణి భూముల్లో కోసిన వరి ఒదెలు తడిసిపోయాయి. మరో రెండు రోజుల పాటు వర్షపు చినుకులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. వర్షపు జల్లులతో క్రిస్మస్ వేడుకలకు అసౌకర్యం కలిగించింది. పలు ప్రధాన వీధుల్లో క్రిస్మస్ అలంకారాలు చేసేందుకు వీలు లేకుండా పోయింది.

దీర్ఘకాలిక నొప్పులకు

ఫిజియోథెరపీ అవసరం

- డాక్టర్ పద్మ





తెనాలి, మారీసుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక నొప్పులను తగ్గించడానికి రోగికి ఫిజియోథెరపీ అవసరమని జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ పి.పద్మ మంగళవారం అన్నారు. ఆంధ్రజ్యోతికి డాక్టర్ పద్మ తెలిపిన వివరాలు.

ప్రశ్న: ఫిజియోథెరపీ అంటే ఏమిటి?

జవాబు: ఫిజియోథెరపీ అంటే శారీరక కదలికను మెరుగుపరచడానికి, నొప్పిని తగ్గిండానికి, గాయాలు, వైకల్యాల వల్ల కలిగే సమస్యలకు అందించే వైద్యం.

ప్రశ్న: ఫిజియోథెరపీలో ఎటువంటి పద్ధతులు వాడతారు ?

జ: ఫిజియోథెరపీలో శాస్త్రీయ వ్యాయామాలు, మాన్యువల్ మానిప్యులేషన్, డ్రై నీడ్లింగ్, టేపింగ్, థెరపీ వంటి భౌతిక పద్ధతులను ఉపయోగిస్తాం.

ప్రశ్న: ఫిజియోథెరపీలో నొప్పి తగ్గుతుందా ?

జ: ఫిజియోథెరపీ వల్ల రోగికి నొప్పి నుంచి ఉపశమనం, మెరుగైన కదలికలు వస్తాయి.

ప్రశ్న: ఫిజియోథెరపీ అన్ని వయస్సుల వారికి తగినదేనా ?

జ: వివిధ వయస్సుల వారికి అనుకూలంగా ఉంటుంది. మేనరికపు పెళ్లి చేసుకున్న దంపతులకు జన్మించిన చిన్నారులకు కూడా ఫిజియోథెరపీ అవసరమవుతుంది. పెద్దవారికి వచ్చే కండరాల నొప్పి, కీళ్ల నొప్పికి, ప్రమాదాల బారినపడి శస్త్ర చికిత్సలు జరిగిన రోగి త్వరగా కోలుకోవడానికి ఫిజియోథెరపీ అవసరం.

ప్రశ్న: ఫిజియోథెరపీతో పాటు రోగులకు ఎటువంటి సూచనలు చేస్తారు ?

జ: వ్యాయామం ద్వారా పరిష్కారమయ్యే విధానాన్ని అవగాహన కల్పిస్తాం. ఇంటిలోనే ఉండి ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా సాధ్యమైనంత వరకు సమస్యలను అధిగమించి సాధారణ జీవితాన్ని గడపవచ్చు.

స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- డీఎల్‌పీవో స్వరూపరాణి

కొల్లిపర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీవో స్వరూపరాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో స్వచ్ఛ సంపద తయారీ కేంద్రాన్ని ఆమె తనిఖీ నిర్వహించారు. పంచాయతీ సిబ్బందికి స్వచ్ఛ సంపద తయారీపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ స్వచ్ఛ సంపద ప్రధాన్యంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల వలన ప్రజలకు అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామాల్లో పారిశుధ్యంపై తగిన శ్రద్ధతీసుకోవాలన్నారు. రోడ్ల పక్కన చెత్తచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. కాల్వల్లో మురుగునీరు తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, పంచాయతీ కార్యదర్శి అలకనంద తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఫిర్యాదుపై మొక్కజొన్న సాగు పరిశీలన

పొన్నూరు టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగు చేసిన రైతుల ఫిర్యాదు మేరకు మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పంట పొలాలను పరిశీలించారు. మండల పరిధిలోని చింతలపూడి, మాచవరం, ములుకుదురు, నండూరు, వల్లభరావుపాలెం, కసుకర్రు గ్రామాలకు చెందిన రైతులు సిజెంటా కంపెనీ మొక్కజొన్న విత్తనాలను కొనుగోలుచేసి సాగు చేశారు. అయితే ఈ కంపెనీ సరఫరా చేసిన విత్తనాలు మొలకెత్తక పోవడంతో రైతులు వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదుచేశారు. రైతుల ఫిర్యాదు మేరకు ఏడీఏ వి రామకోటేశ్వరి, స్థానిక వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాల్లో సాగుచేసిన మొక్కజొన్న విత్తనాలను పరిశీలించే కంపెనీ ప్రతినిధులను పిలిపించి వివరణ కోరారు. రైతులకు న్యాయం చేసేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పొన్నూరు టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. సెమీ క్రిస్మస్ సందర్భంగా కేకులు కోసి పంచిపెట్టారు. దైవ ప్రసంగీకులు బైబిల్ సారాంశాన్ని బోధించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సూచనలతో కార్యక్రమ నిర్వాహకులు 500మంది పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో నేతాజీనగర్‌కు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.